

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




త్వరలో నూతన ఏపీ టెక్స్‌టైల్ పాలసీ
- మంత్రి ఎస్ సవిత

9

## కలుషితాహారం ఘటనపై సీఎం సీరియస్

- కైలాసపట్టణంలో ముగ్గురు విద్యార్థులు మృతి
- ఉన్నతస్థాయి విచారణకు ముఖ్యమంత్రి ఆదేశం
- బాధ్యులపై కఠినచర్యలు
- బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం
- మంత్రి లోకేష్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్న సీఎం
- విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటామన్న మంత్రి లోకేష్

4 లో



# స్పీడ్ ఆఫ్ డూయింగ్!

- పారిశ్రామిక వృద్ధికి.. ఆధునిక మంత్ర
- ఆ దిశగా ప్రయాణానికి సరైన తరుణమిదే
- కాస్ట్ ఎఫెక్టివ్ ప్రోడక్ట్స్‌కు శ్రీసిటీ వేదికవ్వాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు
- శ్రీసిటీలో 15 సంస్థల కార్యకలాపాలు ప్రారంభం
- 7 పరిశ్రమలకు శంకుస్థాపన
- 5 కంపెనీలతో రూ.1,213 కోట్ల పెట్టుబడికి ఒప్పందాలు
- రూ.900 కోట్ల పెట్టుబడితో 2,740 మందికి ఉపాధి అవకాశాలు
- ఫైర్‌స్టేషన్ ప్రారంభం, పోలీస్‌స్టేషన్‌కు శంకుస్థాపన
- బిజినెస్ సెంటర్‌లో పలు కంపెనీల సీఈవోలతో బాబు భేటీ

2 లో





## కరవనేదే ఉండకూడదు

కేంద్ర, రాష్ట్రాలనుంచి రైతుకు సాయం
రూ.5.4 కోట్లతో సోమశిలకు మరమ్మతులు
సీఎం నారా చంద్రబాబు నాయుడు వెల్లడి

3 లో

## పొలిటికల్ పెన్‌కౌంటర్



రాష్ట్రంలో నీటి ప్రాజెక్టుల మీద ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్లక్ష్యం చూపిస్తున్నారంటూ వైసీపీ జగన్ పెద్ద జోకు పేల్చారు. రాష్ట్ర జీవనాడి పోలవరాన్ని, తన నిర్లక్ష్యంతో గోదారి పాల్జేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్.. నీటి ప్రాజెక్టులపై అర్ధాంతరంగా ప్రేమ చూపించడం అత్మవంచన.. అతిశయోక్తి!

ఉన్నమాట అన్నందుకె
ఉలుకెందుకు జలగన్నా!
ప్రాజెక్టుల నిర్లక్ష్యం
రాష్ట్ర రైతు-కెరుకన్నా!?

వైసీపీ ఏలుబడిలో
రైతుకేది భరోసా!
కడుపుమండి ఓడించిరి....
కఠిక నిజము నీకు తెలుస!!

ఎంతచేసి ఏడ్చిఏమి
పోలవరం సంపినావు!?
ఆ పాపమె వెంటాడి
ఓటమితో సచ్చినావు!!

నేనింత.. నాదింతని
చెప్పుకొనుట ఎందుకులే!
రాష్ట్రప్రజలు ఒక్కరైన
చెప్పినపుడు మాద్దుములే!?

-మహాదేవ



ఆడబిడ్డల ఆత్మగౌరవం, భద్రత, అభివృద్ధికి

## ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ
- సీఎం కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

- వివరాలు 5 లో.



మహిళా సంక్షేమం, భద్రతే

## కూటమి ప్రాధాన్యతలు

- ఉండవల్లి నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుక
- మంత్రి నారా లోకేష్‌కు రాఖీలు కట్టిన తెలుగు మహిళలు

7 లో

బడుగులకు విద్య, వైద్యంలో

## బాధ్యత ముఖ్యం

- గురుకులాలు, వసతిగృహాల్లో పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలి
- శాఖ ఉద్యోగులు మెరుగైన ఫలితాలు సాధించేలా కృషిచేయాలి
- ఎస్సీల ఆదాయం పెంపునకు ప్రణాళికలు రూపొందించాలి
- త్వరలో ఎస్సీ విద్యార్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇస్తాం
- సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

11 లో

అన్న క్యాంటీన్లకు

## శిష్టా లోహిత్ రూ.కోటి విరాళం

- పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం అభినందనీయం: లోకేష్



5 లో



పెట్టుబడులకు

## స్వర్గధామంగా రాష్ట్రం

- 20 లక్షల ఉద్యోగాల కల్పనే మా లక్ష్యం
- ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో సమావేశంలో మంత్రి నారా లోకేష్
- రాష్ట్రంలో పెట్టుబడులకు సూత్రప్రాయంగా ఫాక్స్‌కాన్ అంగీకారం

4 లో



జగనన్న భూ సర్వే

## పెద్ద బోగస్

- గత ప్రభుత్వ బాధితులకు న్యాయం చేస్తాం
- అవినీతిని బయటపెడతామనే రికార్డులు తగలబెడుతున్నారు
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

10 లో



## 23న పల్లె పండువ!

13 వేల 326 గ్రామ పంచాయితీల్లో ఒకేరోజ గ్రామ సభలు
రెండు రోజులు ముందే దండోరాతో ప్రచారం చేయండి
ఉపాధి హామీ పనిదినాల కల్పనపై అవగాహన కల్పించాలి
2024-25లో చేపట్టే పనులకు గ్రామసభల ఆమోదం
ఉప ముఖ్యమంత్రి కె పవన్‌కళ్యాణ్ పిలుపు

9 లో

చైతన్యరథం

# స్పీడ్ ఆఫ్ డూయింగ్!

## పారిశ్రామిక వృద్ధికి.. ఆధునిక మంత్ర

- ఆ దిశగా ప్రయాణానికి సరైన తరుణమిదే
- కాస్ట్ ఎఫెక్టివ్ ప్రోడక్ట్స్‌కు శ్రీసిటీ వేదికవ్వాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు
- శ్రీసిటీలో 15 సంస్థల కార్యకలాపాలు ప్రారంభం
- 7 పరిశ్రమలకు శంకుస్థాపన
- 5 కంపెనీలతో రూ.1,213 కోట్ల పెట్టుబడికి ఒప్పందాలు
- రూ.900 కోట్ల పెట్టుబడితో 2,740 మందికి ఉపాధి అవకాశాలు
- ఫైర్‌స్టేషన్ ప్రారంభం, పోలీస్‌స్టేషన్‌కు శంకుస్థాపన
- బిజినెస్ సెంటర్‌లో పలు కంపెనీల సీఈవోలతో బాబు భేటీ




శ్రీసిటీ (చైతన్య రథం): ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపుగా పారిశ్రామికరంగం వెళ్లాల్సిన అవసరం ఉందని, అందుకు ఇదే సరైన సమయమని సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీసిటీ 'కాస్ట్ ఎఫెక్టివ్ ప్రొడక్టివ్ ఇండస్ట్రియల్ జోన్' కావాలని సీఎం ఆకాంక్షించారు. తిరుపతి జిల్లా శ్రీసిటీలో వివిధ ప్రాజెక్టులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. సోమవారం శ్రీసిటీలో 15 సంస్థల కార్యకలాపాలు ప్రారంభించిన సీఎం... మరో 7 పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా 5 కంపెనీలతో రూ.1,213 కోట్ల పెట్టుబడికి కొత్తగా ఒప్పందాలు చేసుకున్నారు. మొత్తంగా 15,280 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. దీంతోపాటు శ్రీసిటీ చిరకాల వాంఛ అయిన ఫైర్‌స్టేషన్‌ను ప్రారంభించి, పోలీస్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో పలు కంపెనీల సీఈవోలతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు, పెట్టుబడులపై చర్చించారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఈరోజు ఒకేచోట 30 కంపెనీల ప్రతినిధులతో భేటీ కావడం గొప్ప విషయం. శ్రీసిటీలో 8 వేల ఎకరాల్లో పారిశ్రామిక జోన్లు ఏర్పాటయ్యాయి. ఇక్కడ 220 కంపెనీల ఏర్పాటుకు అవకాశముంది. సెజ్, డొమెస్టిక్ జోన్, ఫ్రీ ట్రేడ్ జోన్ ఇక్కడ ఏర్పాటయ్యాయి. ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, ఎఫ్‌ఎంసీజీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వచ్చాయి. శ్రీసిటీలో 4.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించడం, 4 బిలియన్ డాలర్ల ఎగుమతులు సాధించడం గొప్ప విషయమన్నారు.

"1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాయి. 1995లో నేను తొలిసారి సీఎం అయ్యాను. ఇప్పుడు నాల్గోసారి సీఎం అయ్యాను. నేను 1995లో ఉమ్మడి రాష్ట్రంలో ఎకనమిక్ రిఫార్మ్స్ స్టార్ట్ చేశాను. అప్పట్లోనే విజన్ 2020కి రూపకల్పన చేసి అమలు చేశాం. పెట్టుబడులు రాబట్టేందుకు పలు దేశాల్లో పర్యటించాను. భారత్‌ను ఐటీ ప్రపంచపటంలో నిలిచేలా చేస్తుందని ఆనాడే చెప్పాను. ఈరోజు రిజల్ట్ అందరూ చూస్తున్నారు. పీ3 మోడల్‌లో హైటెక్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. హైదరాబాద్‌లో అత్యుత్తమ మౌలిక సౌకర్యాలు కల్పించాం" అని అన్నారు.

"శ్రీసిటీని స్పెషల్ ఎకనమిక్ జోన్‌గా గుర్తించాం. 30 దేశాలు శ్రీసిటీలో పరిశ్రమల ద్వారా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. పారిశ్రామికవేత్తలు ఉపాధి, సంపద సృష్టిస్తున్నారు. పరిశ్రమల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. సంపద సృష్టి ద్వారా సంక్షేమం, సాధికారతకు దోహదపడుతుంది. చెన్నై, కృష్ణపట్నం, తిరుపతి ప్రాంతాలకు శ్రీసిటీ దగ్గరగా ఉంది. శ్రీసిటీని అత్యుత్తమ ఎకనమిక్ జోన్‌గా తయారు చేయాలనేది నా ఆలోచన. శ్రీసిటీ ఐజీబీసీ గోల్డెన్ రేటింగ్ గుర్తింపు వచ్చేలా కృషి చేస్తున్నాం. శ్రీసిటీకి అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. శ్రీసిటీని అత్యంత అనుకూల నివాసయోగ్య ప్రాంతంగా మారుస్తాం. పచ్చదనం కోసం వంద శాతం వాననీటి సంరక్షణకు చర్యలు చేపడతాం. వీలైనంత వరకు ఉత్పత్తి, లాజిస్టిక్ ధరలు తగ్గించాలి. ఆ దిశగా ప్రభుత్వం కూడా చర్యలు చేపడుతుందని అన్నారు. తక్కువ ఖర్చుతో ఉత్పత్తులు చేసేందుకు శ్రీసిటీ వేదిక కావాలని సీఎం సూచించారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నాలుగేళ్లు నెంబర్ వన్‌గా ఉన్నాం. 2029 నాటికి భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా ఎదుగుతుంది.నాకు నమ్మకముంది.భారతీయులు ప్రతి రంగంలోనూ సృష్టికర్తలుగా ఉన్నారు. ప్రపంచంలోని ప్రతి నలుగురు ఐటీ ఉద్యోగుల్లో ఒకరు భారతీయులు ఉంటారు. ప్రతి నలుగురు ఐటీ ఉద్యోగుల్లో ఒకరు ఆంధ్రప్రదేశ్ నుంచీ ఉంటారు. అదీ ఆంధ్రప్రదేశ్ సామర్థ్యం. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా ఏరంగం చూసుకున్నా అందులో ఇండియన్స్ ఉంటున్నారు. ఇప్పటికే మేము విజన్ 2047 లక్ష్యంతో ముందుకెళుతున్నాం. రానున్న 25 ఏళ్లలో 15 శాతం వృద్ధి రేటు మా లక్ష్యం. జీరో పావర్టీ సాధించే దిశగా అడుగులు వేస్తున్నాం. పీ4 మోడల్ అమలు చేస్తున్నాం. టాప్ 10 శాతంలో ఉన్నవారు కింది 20 శాతంలో ఉన్నవారికి సాయం అందించాలి. డెమోగ్రఫిక్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక శ్రద్ధపెట్టాం. మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తాం. పరిశ్రమలకు ఇబ్బంది లేకుండా లా అండ్ ఆర్డర్ అమలు చేస్తాం. అనుకూల వాతావరణం కల్పిస్తాం. డ్రగ్స్, గంజాయి నిర్మూలిస్తాం. శాంతి భద్రతల విషయంలో జీరో టాలరెన్స్ మా లక్ష్యం. నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి అన్నారు.

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో సీఎం ఒక్కసారి కూడా శ్రీసిటీని సందర్శించలేదు. కానీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేసే ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీసిటీకి వచ్చారు. సీబీఎన్ అంటేనే ఒక బ్రాండ్. వచ్చే ఐదేళ్లలో చంద్రబాబు విజన్‌కు తగ్గట్టుగా రాష్ట్రాభివృద్ధి జరుగుతుంది అన్నారు.

జపనీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాడోసన్ మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నికైన చంద్రబాబుకు అభినందనలు తెలుపుతూ.. శ్రీసిటీలో పరిశ్రమల స్థాపనకు ఇప్పటికే మంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పించారన్నారు. పలు జపాన్ కంపెనీలు శ్రీసిటీలో నెలకొల్పడం జరిగిందని, కంపెనీలకు మరింత సహకారం, ప్రోత్సాహమిచ్చేందుకు సీఎం చంద్రబాబు స్వయంగా రావడం సంతోషమన్నారు. టోరే ప్రతినిధి శ్రీ అజయ్ మాట్లాడుతూ.. మునుపటి ప్రభుత్వం డిజైన్ చేసిన సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్‌లోనే భాగస్వామ్యమయ్యామని, 2016లో శ్రీసిటీలో 4 ప్లాంట్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఇసుజు ప్రతినిధి మిట్టల్ మాట్లాడుతూ.. ఇసుజు ఇప్పుడు లార్జెస్ట్ ఎక్స్‌పోర్టర్ ఆఫ్ కమర్షియల్ వెహికల్ ఫ్రమ్ ఇండియా అయ్యిందన్నారు. మా పరిశ్రమలో 20శాతం మహిళలకు ఉపాధి కల్పించాం. లక్ష వాహనాలను మార్కెట్‌లోకి విడుదలచేసేందుకు సిద్ధమయ్యాం. ఆకార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అతిథిగా రావాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు.

డైకిన్ ప్రతినిధి నిమ్మగడ్డ కుటుంబరావు మాట్లాడుతూ.... 2017లోనే జపాన్ కంపెనీలు రావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. అందులో డైకిన్ ఒకటి. శ్రీసిటీలో 75 ఎకరాల్లో డైకిన్ పరిశ్రమ ఏర్పాటు చేశాం. తర్వాత మరో 35 ఎకరాల్లో, దాని తర్వాత మరో 200 ఎకరాలకు విస్తరించాం. ఇప్పుడు శ్రీసిటీలోని డైకిన్‌నుంచి ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకూ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి అనిత, పరిశ్రమల మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు కోనేటి ఆదిమూలం, విజయశ్రీ, డీజీపీ ద్వారకా తిరుమలరావు, డిజాస్టర్ మేనేజ్ మెంట్ అండ్ ఫైర్ సర్వీసెస్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్, ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు, తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, శ్రీసిటీ యాజమాన్యం, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.























సోమశిల ప్రాజెక్టు స్లూయిస్, స్పిల్‌వేను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. మ్యాప్ పాయింటింగ్ ద్వారా ప్రాజెక్టు పరిస్థితిని అధికారులనుంచి అడిగి తెలుసుకుంటున్న చంద్రబాబు

# ఏపీలో కరవనేదే ఉండకూడదు

- కేంద్ర, రాష్ట్రాలనుంచి రైతుకు ఆర్థిక సాయం
- ఖర్చు తగ్గించి వ్యవసాయం లాభసాటి చేస్తా
- వైసీపీ హయాంలో సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం
- పథకాలు పూర్తిచేస్తే కాదు, నిర్వహణా ముఖ్యమే
- రూ.5.4 కోట్లతో సోమశిల తక్షణ మరమ్మతులు
- రాష్ట్ర ప్రాజెక్టుల మరమ్మతులకు 300 కోట్లు అవసరం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడి
- సోమశిల స్పిల్‌వే, స్లూయిస్ క్షేత్రస్థాయిలో పరిశీలన



ఆత్మకూరు/ సోమశిల (చైతన్య రథం): 'ఒకప్పుడు దేశానికే అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్. అలాంటి రాష్ట్రం గత ప్రభుత్వ అసమర్థ ధానాలు, నిర్లక్ష్య ధోరణి కారణంగా గడ్డు పరిస్థితులు ఎదుర్కొంది. రాష్ట్రంలో కరవనేది ఉండకూడదు. రైతులకు ఖర్చులు తగ్గించి సాగును లాభసాటిగా మారుస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి యేటా రూ.20 వేల సాయమందిస్తాం. సోమశిల ప్రాజెక్టును సద్వినియోగం చేసుకునేలా బాధ్యత తీసుకుని పరిరక్షణ చర్యలు తీసుకుంటాం. నేను ఇక్కడికి రాకపోతే అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటారన్న ఉద్దేశ్యంతో వచ్చాను. ప్రాజెక్టును పరిశీలించి భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై ఆదేశాలిచ్చాను' అని సీఎం చంద్రబాబు అన్నారు. నెల్లూరు జిల్లాలోని సోమశిల ప్రాజెక్టును సోమవారం పరిశీలించి, మ్యాప్ పాయింటింగ్ ద్వారా ప్రాజెక్టు పరిస్థితిని అధికారులనుంచి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

**సోమశిల ప్రాజెక్టుకు మరమ్మతులు చేయిస్తాం**

'దెబ్బతిన్న సోమశిల గేట్లను రూ.5.40 కోట్లతో మరమ్మతు చేయించి, ఆప్రాన్ నిర్మిస్తాం. స్లూయిస్‌లో గోడ నిర్మిస్తాం. రాష్ట్రంలోని ప్రాజెక్టుల మరమ్మతులకు రూ.300 కోట్లు ఖర్చవుతుంది. ఒక్క సోమశిలకే రూ.140 కోట్లు అవసరం. ఆస్తిని నిర్మించడం ఎంత ముఖ్యమో కాపాడుకోవడమూ అంతే ముఖ్యం. ప్రాజెక్టు గేట్లకు గ్రీజు, మెయింటెనెన్స్, కాల్వల్లో పూడికలు చాలా ముఖ్యం. కానీ ఐదేళ్లుగా ప్రాజెక్టుల స్థితిగతులను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. సోమశిల ప్రాజెక్టు చారిత్రాత్మకమైంది. 38 టీఎంసీల సామర్థ్యమున్న ప్రాజెక్టును ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక 78 టీఎంసీలకు పెంచారంటే.. అది ఎన్టీఆర్ దూరదృష్టి. సోమశిల ద్వారా 5.84 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. 2018 ప్రాజెక్టుకు నీళ్లు అనుకున్న స్థాయిలో రాకపోవడంతో పంటలు దెబ్బతింటాయని శ్రీశైలం నుండి 25 టీఎంసీ తీసుకొచ్చి పంటలు కాపాడాం. రైతుల సమస్యలు అర్థం చేసుకునే పార్టీ టీడీపీ. కండలేరులో కూడా 68 టీఎంసీ నిల్వచేసుకొని 3 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే అవకాశముంది. ఈ రెండు ప్రాజెక్టుల్లో నీళ్లుంటే నెల్లూరు, కొంత తిరుపతి, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు నీళ్లివ్వొచ్చు. ఈ యేడాది ఎగువ ప్రాంతాల్లో వర్షాలు బాగా పడ్డాయి. మన రాష్ట్రంలోనూ బాగా కురిశాయి. కృష్ణా నదిపై ఉన్న జలాశయాలన్నీ నీటితో కళకళ లాడుతున్నాయి. పెన్నాకూ వరద పెరిగితే కండలేరు, సోమశిల నిండుతాయి. భూమినే జలాశయంగా చేయగలిగితే నీటి సమస్యే ఉండదు. రైతులకు నీళ్లు సకాలంలో ఇస్తే బంగారం పండిస్తారు. మొత్తం రిజర్వాయర్లలో 983 టీఎంసీ నిల్వ చేసుకోవచ్చు. రాష్ట్రంలో ఇప్పటివరకు 692 టీఎంసీ నిల్వ చేసుకున్నాం. 20 ఏళ్ల తర్వాత మొదటిసారిగా ఏపీలో ఆగస్టు నెలలో రిజర్వాయర్లన్నీ కళకళలాడుతున్నాయి. వరుణుడు మనల్ని ఆశీర్వదిస్తున్నాడు. రేడియం క్రస్ట్ గేట్లు, స్లూయిస్‌లు దెబ్బతిన్నాయి. కొన్ని గేట్లు తుప్పుపట్టి పోయాయి' అని సీఎం అన్నారు.

**ఆ డబ్బులో సగంపెట్టినా ప్రాజెక్టులు పూర్తి**

'జగన్ సర్కారు సర్వేరాళ్లపై బొమ్మలకు, రిషికొండ ప్యాలెస్‌కు పెట్టిన ఖర్చులో సగం పెట్టినా ప్రాజెక్టులు పూర్తై ఉండేవని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రైతాంగం మొత్తానికి నీరిచ్చే మార్గం చూస్తున్నా. పట్టిసీమను నాడు వ్యతిరేకించారు. అయినా నిర్మించి 100 టీఎంసీ శ్రీశైలంలో నిల్వచేశాం. నాగార్జునసాగర్ కుడి కాల్వకు గోదావరి నీళ్లు తెస్తే 160 టీఎంసీ పొదుపు చేసుకోవచ్చు. వాటితో రాయలసీమలోని రిజర్వాయర్లన్నీ నింపుకోవచ్చు. నాగార్జున సాగర్ వద్ద నల్లమల అడవుల గుండా టన్నెల్ నిర్మించి బనకచర్లకు నీళ్లు తీసుకెళ్తే వేల టీఎంసీ నీళ్లు గోదావరి నుంచి సీమకు తెచ్చుకోవచ్చు. డబ్బులివ్వకపోతే కాంట్రాక్టర్ పనిచేస్తారా? ప్రాజెక్టుల గేట్లకు గ్రీజు కూడా పెట్టలేని ప్రభుత్వం ఐదేళ్లు పాలించింది. ప్రాధాన్యతలు తెలిసిన ప్రభుత్వమిది. పాత రోజులు మరచిపోవాలని అందరికీ చెబుతున్నా. బాధ్యతగా పనిచేయాలి. సకాలంలో పనులు పూర్తి చేయాలి. గత ప్రభుత్వంలో సర్వే రాళ్లపై బొమ్మలకు రూ.700 కోట్లు ఖర్చుపెట్టారు. పేపర్లలో ప్రకటనలకు రూ.403 కోట్లు ఖర్చుపెట్టారు. రిషికొండ కొట్టేసి రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టించుకున్నారు. ఈ డబ్బుల్లో రూ.200 కోట్లు ఖర్చుపెట్టినా ప్రాజెక్టులు పూర్తయ్యేవి. తుంగభద్రలో గేటు కొట్టుకుపోతే వెంటనే ఇంజనీర్‌ను పంపాం. కర్నాటకకు మన మంత్రులు వెళ్లి మాట్లాడారు. మన వద్ద ఉన్న ఇంజనీర్ కన్నయ్యనాయుడును పంపాం. మూడు, నాలుగు రోజుల్లోనే గేటు పెట్టి నీటిని నిల్వచేయగలిగాం. వారికి అభినందనలు తెలుపుతున్నా' అన్నారు.

**తప్పు చేసిన వారు ఎక్కడ దాక్కున్నా వదలను**

'నేను సీఎంగా బాధ్యతలు చేపట్టగానే 5 హామీల అమలుపై సంతకాలు పెట్టాను. చదువుకున్న యువతకు ఉద్యోగాలివ్వాలనే ఉద్దేశ్యంతో మెగా డీఎస్సీలో భాగంగా 16,347 ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నాం. రెండో సంతకం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపై చేశాం. మీ భూములకు కూడా టెండర్ పెట్టడానికి గత పాలకులు ఈ చట్టాన్ని తెచ్చారు. మదనపల్లిలో ఫైళ్లు తగలబెట్టారు. షార్ట్ షర్క్యూట్ అని ప్రచారం చేశారు. ఇది షార్ట్ సర్క్యూటా? లేక వివేకానందరెడ్డిలాగా గొడ్డలిపోటా? అన్న అనుమానం వచ్చింది. కరుడుగట్టిన నేరస్తులు రాజకీయ ముసుగులో తప్పులు చేసి మాట్లాడుతున్నారు. గుడ్డ కాల్చి ముఖాన వేసి తుడుచుకోమని చెప్తున్నారు. వివేకాను చంపి నారాసుర రక్తచరిత్ర అని మళ్లీ నాపైనే కథనాలు రాశారు. అందుకే మదనపల్లిలో ఫైల్స్ దగ్ధంపై డీజీపీ, ఇంటెలిజెన్స్ అధికారులను పంపి అక్కడికి విచారణకు ఆదేశించాను. అసైన్డ్ భూములను 22ఏ నుండి ఫ్రీహోల్డ్ చేసి భూములు దోచేశారు. ఇళ్లలో కూర్చుని నచ్చినట్లు ఫైళ్లు రాశారు. నిన్న పోలవరం ఫైల్స్, అంతకుముందు పొల్యూషన్ బోర్డు ఫైల్స్ కాల్చేశారు. ఫైల్స్ తగలబెట్టి మళ్లీ ఏమీ తెలియనట్లుగా ఎదురు మాట్లాడుతున్నారు. మా ప్రభుత్వంలో రాజకీయ కక్షలు ఉండవు. కానీ తప్పులు చేసిన వారు ఎక్కడ దాక్కున్నా వదిలేది లేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు.

**ఇసుక ర్యాంపులు పరిశీలిస్తా**

'ఇసుకను ఫ్రీగా ఇవ్వాలని చెప్పిన మాట ప్రకారం అమలు చేశాం. నాకు ఎన్ని సవాళ్లు వచ్చినా ఎదుర్కొంటా. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలను కోరుతున్నా. మనకు మంచి పేరు రావాలంటే కలిసి పనిచేయాలి. ఉచిత ఇసుక చివరి లబ్ధిదారు వరకు చేరాలి. సీనరేజ్, రవాణా, తవ్వకం ఖర్చు తప్ప ఇసుకకు ఒక్కరూపాయి కూడా చెల్లించాల్సిన పనిలేదు. అప్పుడప్పుడు ఇసుక ర్యాంపులను నేను కూడా సందర్శిస్తా. పేదలకు రూ.5లకే అన్నక్యాంటీన్ ద్వారా అన్నం పెడుతుంటే సహించలేకపోతున్నారు. ఇటీవల 100 క్యాంటీన్లు ప్రారంభించాం. త్వరలో అన్నింటినీ ప్రారంభిస్తాం. మద్యంలో కూడా సొంత బ్రాండ్లతో గత పాలకులు ప్రజల ప్రాణాలు తీశారు. మద్యం దోపిడీపైనా విచారణ చేయిస్తున్నాం. 7 ప్రధానాంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేసి వాస్తవాలను ప్రజలకు వివరించాం' అని సీఎం పేర్కొన్నారు.

**అనకాపల్లి ఘటనకు కారకులపై చర్యలు**

'అనకాపల్లి జిల్లాలో అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తినడంతో ముగ్గురు విద్యార్థులు చనిపోయారు. మంచి కార్యక్రమం చేసేటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలి. తప్పులు చేయడానికి అవకాశం ఉండకూడదు. ఆ ఆశ్రమాన్ని మూసేసి పిల్లలను ప్రభుత్వమే చదివించేలా చర్యలు తీసుకుంటుంది. నిర్వాహకులను విచారించి కఠిన చర్యలు తీసుకుంటాం. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు, సంరక్షులకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తాం. ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకొనేవరకు ప్రభుత్వమే ఖర్చు భరిస్తుంది. తప్పు చేసిన వారు ఎంతగొప్పవారైనా శిక్షిస్తేనే అందరిలో భయం ఉంటుం'దని చంద్రబాబు వ్యాఖ్యానించారు.



సోమశిల క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం రైతులతో ముఖాముఖిలో ముఖ్యమంత్రి చంద్రబాబు



# కలుషితాహారం తిని ముగ్గురు విద్యార్థుల మృతి

## సీఎం చంద్రబాబు సీరియస్



- ఉన్నతస్థాయి విచారణకు ఆదేశం
- బాధ్యులపై కఠినచర్యలు
- బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం
- మంత్రి లోకేష్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి
- విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటామన్న మంత్రి లోకేష్

అనకాపల్లి (చైతన్యరథం): అనాథాశ్రమంలో కలుషితాహారం తిని అస్వస్థతకు గురైన ముగ్గురు విద్యార్థులు మృతిచెందారు. మరో 24మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.10లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. రెండు రోజుల క్రితం అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాస పట్టణంలోని అనాథాశ్రమంలో కలుషితాహారం తిని 27మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరికి చికిత్స అందిస్తుండగా సోమవారం ముగ్గురు మృతిచెందారు. మృతి చెందిన విద్యార్థులను జాషువా,భవాని,శ్రద్ధగా గుర్తించారు. మిగతా 24 మందికి నర్సీపట్నం, అనకాపల్లి ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఏడుగురు,అనకాపల్లి ఏరియా ఆసుపత్రిలో 17 మంది విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. ఘటనపై డీఈవో అప్పారావు విచారణ చేపట్టారు.

**ఉన్నతస్థాయి విచారణకు సీఎం ఆదేశం**

అనకాపల్లి జిల్లా, కోటవురట్ల మండలం కైలాస పట్టణంలోని అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. బాధిత విద్యార్థుల కుటుంబసభ్యులు,సంరక్షకులకు రూ.10లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ఘటనకు గల కారణాలపై పూర్తి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఈఅంశంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో ఫోన్లో మాట్లాడిన సీఎం చంద్రబాబు ఘటన వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న వైద్య సహాయం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని మంత్రి లోకేష్‌కు సూచించారు. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు తరువాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యార్థుల మృతికి కారణమైన వారిని అరెస్టు చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అనధికారిక హాస్టల్ మూసివేయాలన్నారు. చిన్నారుల బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. అస్వస్థతకు గురైన చిన్నారుల వైద్యఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు జారీచేశారు. హాస్టళ్లు, శిశుసంరక్షణ కేంద్రాల్లో తనిఖీలు చేయాలన్నారు. అనుమతులు, భద్రతా ప్రమాణాలను పరిశీలించాలన్నారు.పారిశుద్ధ్యం, ఆహార నాణ్యత ఎలా ఉందో చూడాలని ఆదేశించారు.

**ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి లోకేష్**

అనాథాశ్రమంలో కలుషితాహారం తిని విద్యార్థులు మృతి చెందిన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర విద్య,ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ ఘటనపై తన మంత్రివర్గ సహచరుడు,ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు జిల్లా కలెక్టర్లతో మాట్లాడానన్నారు అనకాపల్లిఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 17మంది విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాల్సిందిగా అధి కారులను ఆదేశించానని తెలిపారు.మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు చోటుచేసు కోకుండా అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలని లోకేష్ స్పష్టం చేశారు.

**హాస్టల్ నిర్వాహకుడి అరెస్ట్**

విద్యార్థుల మృతి ఘటనలో హాస్టల్ నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హాస్టల్‌లో 86 మంది విద్యార్థులు ఆహారం తీసుకున్నట్లు నిర్ధారణ అయింది,కలుషిత ఆహారంతినడంవల్లే ముగ్గురు చిన్నారులు చనిపోయారని అనకాపల్లి ఎస్పీ దీపిక చెప్పారు. కిరణ్‌కుమార్‌పై హత్య కేసు నమోదు చేశామన్నారు. ట్రస్టు నిర్వహణలో ఇంకా ఎవరైనా ఉంటే వారిపైన కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

# పెట్టుబడులకు స్వర్గధామంగా రాష్ట్రం



- ఉద్యోగాల గమ్యస్థానంగా ఏపీ
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే మా లక్ష్యం
- ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో సమావేశంలో మంత్రి నారా లోకేష్
- రాష్ట్రంలో పెట్టుబడులకు సూత్రప్రాయంగా ఫాక్స్‌కాన్ అంగీకారం
- ప్లాంట్ కాదు.. ఫాక్స్‌కాన్ మెగా మ్యానుఫ్యాక్చరింగ్ సిటీ ఏర్పాటు చేయాలని లోకేష్ వినతి
- ఫాక్స్‌కాన్ ప్రతినిధులకు ఎదురెళ్లి లోకేష్ స్వాగతం పలికిన వైనం

అమరావతి(చైతన్యరథం): ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన లోకేష్, ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం ఫాక్స్‌కాన్ సంస్థ ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఉండవల్లి నివాసానికి చేరుకున్న ఫాక్స్ కాన్ బృందానికి ఎదురెళ్లి లోకేష్ స్వాగతం పలికారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అవకాశాలను కంపెనీ ప్రతినిధులకు వివరించారు. 2014 నుండి 2019 వరకూ రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికి తీసుకున్న చర్యలు, తీసుకొచ్చిన ఎలక్ట్రానిక్స్, ఈవీ పాలసీల గురించి వివరించారు. కియా కంపెనీని రాష్ట్రానికి తీసుకొచ్చిన విధానాన్ని ఒక కేస్ స్టడీగా వివరించారు. ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రాయితీలు కల్పించే విధానం కూడా రూపొందిస్తున్నామని చెప్పారు. త్వరలోనే దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఈవీ, ఎలక్ట్రానిక్ పాలసీలు తీసుకురాబోతున్నామని తెలిపారు.

**ఫాక్స్‌కాన్ మెగా మ్యానుఫ్యాక్చరింగ్ సిటీ ఏర్పాటు చేయండి**

సీఎం చంద్రబాబు చొరవతో 2014 నుండి 2019 వరకూ అనేక కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయి. అందులో ఫాక్స్ కాన్ కూడా ఒకటి. 14 వేల మంది మహిళలకు నాడు మీరు ఉద్యోగాలు కల్పించారు. ఇప్పుడు ఫాక్స్ కాన్ ఇండియా తన కార్యకలాపాలను విస్తరించాలని చూస్తోంది. అందులో భాగంగా కేవలం ఒక ప్లాంట్ పెట్టాలని నేను మిమ్మల్ని కోరడం లేదు. ఫాక్స్ కాన్ మెగా మ్యానుఫ్యాక్చరింగ్ సిటీ నిర్మాణం చేయాలని కంపెనీ ప్రతినిధులను లోకేష్ కోరారు. ఫాక్స్ కాన్ మెగా సిటీ ఏర్పాటుకు అవసరమైన పూర్తి సహకారం తాము అందిస్తామని లోకేష్ అన్నారు. ప్రజా ప్రభుత్వంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ లక్ష్య సాధనలో ప్రధాన భూమిక పోషించాలని ఫాక్స్ కాన్ ప్రతినిధులను మంత్రి లోకేష్ కోరారు. అనుమతుల నుండి ఉత్పత్తి వరకూ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. మీకు ఎలాంటి సహకారం కావాలన్నా నేనే స్వయంగా రంగంలోకి దిగుతానని వారికి లోకేష్ భరోసా కల్పించారు. ఫాక్స్ కాన్ మెగా సిటీ ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామని అన్నారు.

**ఏపీలో ఎలక్ట్రానిక్ వాహనాలు, సెమీ కండక్టర్ల తయారీ**

ఫాక్స్ కాన్ కంపెనీ ఇండియన్ రిప్రజెంటేటివ్ వి.లీ మాట్లాడుతూ.. పెట్టుబడులు ఆకర్షణలో సీఎం చంద్రబాబు చూపించే చొరవను కొనియాడారు. ఏపీతో తమకు మంచి అనుబంధం ఉందని.. కానీ గత ఐదేళ్లలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నామని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా తమకు అనేక ప్లాంట్లు ఉన్నాయని, ఇండియాలో భారీ ఎత్తున కార్యకలాపాలు విస్తరించే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. త్వరలోనే తమ బృందం ఏపీ అధికారులతో చర్చించి.. ఎలక్ట్రానిక్ వాహనాలు, సెమీ కండక్టర్లు, డిజిటల్ హెల్త్, మ్యానుఫ్యాక్చరింగ్ కంపోనెంట్స్ తయారీకి సంబంధించిన ప్లాంట్ల ఏర్పాటుకు సుముఖంగా ఉన్నామని అన్నారు. మీ 20లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యానికి మా వంతు సహకారం అందిస్తామని లీ, లోకేష్‌తో అన్నారు.

**త్వరలోనే ఏపీలో కార్యకలాపాల విస్తరణ**

మంత్రి లోకేష్‌తో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టి ఉద్యోగాలు కల్పించేందుకు ఫాక్స్‌కాన్ ప్రతినిధులు సూత్రప్రాయంగా అంగీకరించారు. త్వరలోనే తమబృందం పర్యటించి పూర్తి స్థాయి ప్రణాళికతో మీ ముందుకు వస్తుందని లోకేష్‌కు కంపెనీ ప్రతినిధులు వివరించారు. ప్రభుత్వం తరపున మీకు పూర్తి సహకారంతో పాటు వీలైనంత త్వరగా కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తామని కంపెనీ ప్రతినిధులకు లోకేష్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఫాక్స్ కాన్ ఇండియన్ రిప్రజెంటేటివ్ వి.లీ, డైరెక్టర్ టూ ఫాక్స్ కాన్ ఛైర్మన్ ఆఫీస్ సెంథిల్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ భరత్ దండి, మేనేజర్ హానా వాంగ్, మేనేజర్ వెక్టర్ చెన్, అసిస్టెంట్ మేనేజర్ గ్యారీ, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్ గౌర్ పాల్గొన్నారు..









ఆడబిడ్డల ఆత్మగౌరవం, భద్రత, అభివృద్ధికి

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

## ముఖ్యమంత్రి చంద్రబాబు రాఖీ పండుగ శుభాకాంక్షలు



అమరావతి(చైతన్యరథం): రాఖీ పండుగ సందర్భంగా తెలుగింటి ఆడ పడుచులకు, అనునిత్యం ఆశీస్సులు కురిపించే అక్కచెల్లెళ్లకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుభాకాంక్షలు తెలిపారు.తెలుగుదేశం పార్టీ ఆది నుంచి ఆడపడుచుల పక్షపాతి అన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించడమే కాకుండా ప్రభుత్వపరంగా ఇచ్చే పథకాలను,ఆస్తులను మహిళామతల్లుల పేరుపైనే ఇచ్చే సంస్కరణ తెచ్చింది కూడా తెలుగుదేశమే. మహిళా సాధికారత కోసం 'డ్వాక్రా' సంఘాలు, బాలికా విద్యకు ప్రోత్సాహం, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు వంటి విప్లవాత్మక నిర్ణయాలతో మహిళా సంక్షేమం కోసం కృషిచేశాం. ఆడబిడ్డల ఆత్మగౌరవం,భద్రత, అభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటిస్తూ... ఈ 'రక్షాబంధన్' సమయంలో మరోసారి శుభాకాంక్షలు తెలుపుతూ మీకు అన్నివేళలా, అన్నివిధాల అండగా ఉంటానని హామీ ఇస్తున్నానని ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు.

**సీఎం చంద్రబాబుకు రాఖీలు కట్టిన మహిళా నేతలు, బ్రహ్మకుమారీలు**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి మహిళా నేతలు, బ్రహ్మ కుమారీలు రాఖీలు కట్టారు.

రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పార్టీ మహిళా నేతలు మాజీ మంత్రి పీతల సుజాత, కృష్ణా జడ్పీ మాజీ ఛైర్ పర్సన్ గద్దె అనురాధ, టీడీపీ డ్వాక్రా - అంగన్వాడీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత, కంభంపాటి శిరీష, పలువురు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా సీఎం వారికి ధన్యవాదాలు తెలిపి శుభాకాంక్షలు తెలిపారు.





తొలగిన అడ్డంకులు..

## త్వరలోనే రైల్వేజోన్

- రైల్వేమంత్రి అశ్వనీ వైష్ణవ్

ఢిల్లీ: విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుకు అడ్డంకులు తొలగిపోయాయని రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా త్వరలోనే రైల్వేజోన్ ఏర్పాటు చేయనున్నట్లు అశ్వినీ వైష్ణవ్ సోమవారం తెలిపారు.
దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సమన్వయంతో పని చేస్తున్నాయన్నారు.
భూ కేటాయింపు, ఇతర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారముందన్నారు.
అతిత్వరలోనే జోన్ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి అవసరమైన సన్నాహాలకు సిద్ధమవుతామన్నారు.
గత ప్రభుత్వ హయాంలో భూ విషయంలో అభ్యంతరాలు తలెత్తిన నేపథ్యంలో..
ఈ విషయంపై కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. ఇరు ప్రభుత్వాల అధికారుల మధ్య సానుకూలంగా చర్చలు జరిగాయని, ఇప్పుడు జోన్ ఏర్పాటుకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలు త్వరలోనే నెరవేరబోతున్నాయన్నారు.

# జర్నలిస్టులకు సీఎం ఫొటోలు

## వరల్డ్ ఫోటోగ్రఫీ డే సందర్భంగా చంద్రబాబు శుభాకాంక్షలు



అమరావతి (చైతన్యరథం): వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఉండవల్లిలోని తన నివాసంలో వివిధ పత్రికల్లో పనిచేస్తున్న ఫొటో జర్నలిస్టులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా సీఎం వారిని ఆప్యాయంగా పలకరించారు. వారి చేతిలో కెమేరాను తీసుకుని స్వయంగా సీఎం ఫోటోలు క్లిక్ మనిపించారు. మీడియాలో ఫొటోగ్రఫీ విభాగంలో విధులు చాలా కష్టతరమని వ్యాఖ్యానించిన ముఖ్యమంత్రి ఈ రంగంలో ప్రతిభ చూపుతున్న వారిని అభినందించారు. నాణ్యమైన సేవలతో ఫొటోగ్రఫీ రంగం బాగుండాలని సీఎం ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలుగు, ఇంగ్లీష్ పత్రికల్లో పనిచేస్తున్న సీనియర్ ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.



# అన్న క్యాంటీన్లకు శిష్టా లోహిత్ రూ.కోటి విరాళం



- పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం అభినందనీయం: లోకేష్
- చంద్రబాబు, లోకేష్ స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు: లోహిత్

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపడుతున్న కార్యక్రమాలతో ప్రేరణ పొందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధి కోఆర్డినేటర్ శిష్టా లోహిత్ అన్న క్యాంటీన్ల నిర్వహణకు కోటి రూపాయలు విరాళం అందజేశారు. ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్‌కు ఈమేరకు సోమవారం రూ.కోటి చెక్కును అందించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్.. శిష్టా లోహిత్‌ను అభినందించారు. లోహిత్ ఇప్పటికే కార్యకర్తల సంక్షేమనిధి కోఆర్డినేటర్‌గా సమర్థవంత మైన సేవలు అందిస్తున్నారని చెప్పారు. అన్న క్యాంటీన్ల కోసం లోహిత్ లాంటి పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఏపేదవాడు ఆకలితో ఉండకూడదన్నది సీఎం చంద్రబాబు ఆశయమని, పేదల ఆకలి తీర్చేందుకు ఎంత ఖర్చుచేసేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యువనేత శిష్టా లోహిత్ మాట్లాడుతూ... ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి పాలనలో పేదలు నరకంచూశారని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడంతో వారి కళ్లలో ఆనందం కనబడుతోందని చెప్పారు. చంద్రబాబు నాయుడు, లోకేష్‌ల స్ఫూర్తితో ఇకముందు కూడా సంక్షేమ కార్యక్రమాలకు తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తానని చెప్పారు.

# దారికి అడ్డంగా వైసీపీ నేతలు గోడ నిర్మించారు

- నకిలీ పత్రాలతో భూములు కబ్జా చేశారు
- పోలీసులు దౌర్జన్యంగా ఇంట్లో బంగారాన్ని తీసుకెళ్లారు
- 27వ రోజు మంత్రి నారా లోకేష్ 'ప్రజాదర్బార్' కు విన్నపాల వెల్లువ
- ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని మంత్రి భరోసా



అమరావతి(చైతన్యరథం): సమస్యలతో 'ప్రజా దర్బార్'కు తరలివచ్చే ప్రతి ఒక్కరికి అండగా నిలుస్తామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఉండవల్లిలోని నివాసంలో 27వ రోజు సోమవారం "ప్రజాదర్బార్" కు మంగళగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు. నేరుగా మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. ప్రతి ఒక్కరికి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి నారా లోకేష్.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమస్యల సత్వర పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

## పోలీసులు దౌర్జన్యంగా ఇంట్లో బంగారాన్ని తీసుకెళ్లారు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి విచారణ లేకుండా తన భర్తపై అక్రమంగా కేసు నమోదుచేసి, ఇంట్లోని 148గ్రాముల బంగారాన్ని పోలీసులు దౌర్జన్యంగా తీసుకెళ్లారని మంగళగిరికి చెందిన అందె స్వర్ణ లత.. మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ అంకమరావు, ఎస్ఐ నారాయణ తమను వేధించారని, విచారించి తగిన న్యాయం చేయాలని కోరారు. దివ్యాంగురాలైన తనకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లికి చెందిన ఎస్.కృష్ణవేణి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం తొలగించిన దివ్యాంగ పెన్షన్‌ను పునరుద్ధరించాలని నవులూరుకు చెందిన సోలా శ్రీదేవి కోరారు. రోజువారీ పనులతో జీవనం సాగించే తనకు రాజధాని రైతు కూలీ పెన్షన్ మంజూరు చేయాలని ఉండవల్లికి చెందిన టీ.కిషోర్ విజ్ఞప్తి చేశారు. భర్త చనిపోయిన తనకు ముగ్గురు పిల్లల పోషణ కోసం ఎయిమ్స్ ఆసుపత్రిలో సెక్యూరిటీ ఉద్యోగం కల్పించాలని తాడేపల్లికి చెందిన కే.ప్రసన్న కోరారు. వైసీపీ నాయకుల అండతో ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చౌటూరులో తమ 220 గజాల స్థలాన్ని కబ్జా చేశారని, తగిన న్యాయం చేయాలని మంగళగిరికి చెందిన అడపా మస్తాన్ రావు విజ్ఞప్తి చేశారు. నర్సింగ్ కోర్సు సర్టిఫికెట్ ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందని, సర్టిఫికెట్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రాతూరుకు చెందిన సీహెచ్ అనూష కోరారు. ఈఎస్ఐ కింద గుండె ఆపరేషన్ చేయించుకున్న తనకు బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కాజకు చెందిన చెందిన కే.శివరామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఆయా విన్నపాలను పరిశీలించి పరిష్కరిస్తా మని మంత్రి నారా లోకేష్ భరోసా ఇచ్చారు.





## ఇంటికి దారి ఇవ్వకుండా వైసీపీ నేతలు అడ్డంగా గోడ నిర్మించారు

నూతనంగా నిర్మించుకున్న తన ఇంటికి దారి ఇవ్వకుండా వైసీపీ నేతలు అడ్డంగా గోడ కట్టారని నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం గండిపాలెంకు చెందిన డి.తిరుపతమ్మ.. మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. ప్రశ్నించిన తనపైనే తిరిగి కేసు నమోదు చేశారని కన్నీటిపర్యంతమయ్యారు. విచారించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు.

ఎలాంటి ఆధారం లేని తమకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజయవాడకు చెందిన హరిత విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

అగ్రికల్చర్ లో డిప్లమో చేసిన తాను ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సీడ్ ప్రొడక్షన్ లో శిక్షణ పొందానని, తగిన ఉద్యోగం కల్పించాలని ప్రకాశం జిల్లా గద్దలకుంటకు చెందిన పిల్లి ప్రసన్న కుమారి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న తనకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని పల్నాడు జిల్లా మేళ్లవాగుకు చెందిన యు.వెంకటేశ్వర్లు కోరారు. పరిశీలించి ఆదుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

వారసత్వంగా వచ్చిన తమ ఏడెకరాల అసైన్డ్ భూమిని వైసీపీ నేతలు నకిలీపత్రాలతో కబ్జా చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం సాతానుపల్లికి చెందిన కంచర్ల హజరత్తమ్మ మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు

డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నియామకంలో నిబంధనలు సడలించి వ్యాయామ ఉపాధ్యాయులకు తగిన న్యాయం చేయాలని సిబ్బంది కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.















# మహిళా సంక్షేమం, భద్రతే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతలు: మంత్రి లోకేష్

**ఉండవల్లి నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుక - మంత్రి నారా లోకేష్‌కు రాఖీలు కట్టిన తెలుగు మహిళలు**















అమరావతి(చైతన్యరథం): మహిళా సంక్షేమం, భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ఉండవల్లిలోని నివాసంలో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుక ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన తెలుగు మహిళల ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్‌కు హారతి ఇచ్చి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా అక్కాచెల్లెమ్మలకు మంత్రి నారా లోకేష్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావం నుంచి మహిళా సాధికారతకు అన్ని విధాల అండగా నిలిచామన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కుతో పాటు మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో స్త్రీ శక్తి కార్యక్రమం ద్వారా మహిళల స్వయం ఉపాధికి కృషిచేశామన్నారు.

అంతకుముందు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, మాజీ మంత్రి పీతల సుజాత, టీడీపీ డ్వాక్రా-అంగన్ వాడీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీతతో పాటు పలువురు మహిళలు మంత్రి నారా లోకేష్ కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మంత్రి లోకేష్ రాఖీ శుభాకాంక్షలు

రాఖీ పౌర్ణమి సందర్భంగా అక్కాచెల్లెళ్లందరికీ మంత్రి నారా లోకేష్ ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలిపారు. సొంత అన్నలా ఆదరించారు.. తోడబుట్టిన తమ్ముడిలా అభిమానించారు.. మీ అనురాగమే నా చేతికి రక్షాబంధనం.. మీ సంక్షేమం కోసం, మీకు భద్రత, గౌరవం కల్పించడం కోసం కృషి చేసి రాఖీ పండగ కానుకగా సోదరీమణులకు అందించడమే మీ సోదరుడిగా నా బాధ్యత అని లోకేష్ పేర్కొన్నారు.













# 300 పడకలకు గుణదల ఇయస్ఐ

## ప్రణాళిక సిద్ధం చేశామన్న కార్మిక మంత్రి సుభాష్

- 10 లక్షల వరకు ఉచిత చికిత్స అందిస్తాం...
- ఇయస్ఐ ఆస్పత్రులకు పూర్వ వైభవం తెస్తాం
- వైయస్సార్ బీమా అవకతవకలపై విజిలెన్స్
- వచ్చే ఐదేళ్లలో ఇయస్ఐ మెంబర్‌షిప్ పెంచుతామని వెల్లడి



అమరావతి(చైతన్య రథం): గుణదల ఇయస్ఐ ఆసుపత్రిని 300పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడంతోపాటు. మౌళిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు రాష్ట్రకార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. గుణదలలోని ఇయస్ఐ ఆసుపత్రి నూతన ప్రాంగణాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1968లో ప్రారంభించి లక్షలాది కార్మిక కుటుంబాలకు వైద్య సేవలందిస్తూ ప్రస్తుతం 110 పడకలున్న ఆసుపత్రిని, 300 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలోని ఇయస్ఐ ఆసుపత్రిలన్నింటినీ దశలవారీ అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి చెప్పారు. కార్మిక కుటుంబాలకు సత్వర వైద్య సేవలందేలా ఇయస్ఐ ఆసుపత్రిలోని అన్ని రోగాలకు వైద్యం అందేలా ఇయస్ఐ ఆసుపత్రులన్నిటిని అభివృద్ధి చేస్తామన్నారు.గత ఐదేళ్లుగా ఇయస్ఐ హాస్పటల్స్‌ను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, సరైన పరికరాలు లేకుండా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. వైఎస్ఆర్ భీమా పేరిట సొంత ఇన్స్యూరెన్స్ కంపెనీ ఏర్పాటు చేసి అవకతవకలకు పాల్పడిందని, వీటిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించామన్నారు. కేంద్ర నిధులను గత ప్రభుత్వం దారి మళ్ళించిందని, కార్మిక శాఖను భ్రష్టు పట్టించిందని మంత్రి అన్నారు. 10మంది కార్మికులున్న ప్రతి సంస్థనూ ఇయస్ఐ పరిధిలోకి తెస్తామని, ఇయస్ఐ మెంబర్‌షిప్ పెంచుతామని, వచ్చే ఐదేళ్లలో 25 లక్షల మెంబర్‌షిప్ పెంచే లక్ష్యంతో పని చేస్తున్నట్టు మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు.

విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ వ్యవసాయం తరువాత ప్రాధాన్యతగల కార్మిక రంగాన్ని ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమానికి నిధులు కేటాయిస్తాయన్నారు. గుణదల ఇయస్ఐ ఆసుపత్రిని కార్మిక కుటుంబానికి ఆరోగ్య భరోసా అందించేలా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గద్దె అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్మిక కర్మాగారాలు బాయిలర్స్ అండ్ ఐయమ్ఎస్ ప్రభుత్వ కార్యదర్శి యంయం నాయక్, యంఎల్‌సి పి.అశోక్‌బాబు, కార్మిక రాజ్య భీమా వైద్యసేవల డైరెక్టర్ వి.ఆంజనేయులు, ఇయస్ఐసి ప్రాంతీయ సంచాలకులు ఎ.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.





### సోదరీమణులకు బాలకృష్ణ రాఖీ పండుగ శుభాకాంక్షలు

అమరావతి(చైతన్యరథం): సోదర, సోదరీమణుల ప్రేమను బంధానికి, అప్యాయతకు చిహ్నమైన రాఖీ పండుగ సందర్భంగా అక్క చెల్లెమ్మలకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. మన మహోన్నత భారతీయ సంస్కృతిలో తోబుట్టువులకు సోదరుడు అండగా, రక్షకుడిగా వుండి ఎల్ల వేళలా వారి మంచిని కోరుకొంటాడు. సోదరుడిని..అక్క చెల్లెళ్లు తల్లిలా ఆదరిస్తారు. ఈ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి.. కొనసాగించాలి. రాష్ట్రంలో అక్కచెల్లెమ్మల రక్షణకు, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఓ సోదరుడు గా హామీ ఇస్తున్నానని బాలకృష్ణ అన్నారు.

### జీడబ్ల్యూటీసీఎస్ స్వర్ణోత్సవాల్లో పాల్గొనండి

#### కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఎన్ఆర్ఐ ప్రతినిధుల ఆహ్వానం



గుంటూరు (చైతన్యరథం): వాషింగ్టన్ డీసీలో జీడబ్ల్యూటీసీఎస్ స్వర్ణోత్సవాలకు కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సంస్థ అధ్యక్షులు కృష్ణ లాం ఆహ్వానించారు. గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమంలో మన్నవ సుబ్బారావుతో కలిసి పెమ్మసాని చంద్రశేఖర్ కు ఆహ్వానపత్రికను అందజేశారు. సెప్టెంబర్ 27,28 తేదీల్లో జీడబ్ల్యూటీసీఎస్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొనవలసిందిగా కోరారు. అదే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారంకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. దేశంలో ఉన్న ఆస్తులకు రక్షణ కల్పించాలని, అవి అన్యాక్రాంతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో వారి ఆస్తులకు రక్షణ కరువైందన్నారు. ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని పెమ్మసాని ఈ సందర్భంగా వారికి హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మిర్చియార్డ్ మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, సామినేని కోటేశ్వరరావు, గోరంట్ల పున్నయ్య చౌదరి, ఘంటా పున్నారావు, వడ్లమూడి నాగేంద్రం, రాయపాటి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఫైబర్‌నెట్ మాజీ ఎండీ మధుసూదన్‌రెడ్డి సస్పెన్షన్



అమరావతి: ఫైబర్ నెట్ మాజీ ఎండీ మధుసూదన్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. మధుసూదన్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ సోమవారం నాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫైబర్ నెట్ కార్పోరేషన్‌లో అవినీతిని కప్పి పుచ్చుకునేలా మధుసూధన్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని జీవోలో పేర్కొంది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని మధుసూదన్ రెడ్డి మీద అభియోగాలు నమోదు అయ్యాయి. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని మధుసూదన్ రెడ్డిపై అభియోగాలు ఉన్నాయి. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు రికార్డులు తారుమారు చేసేందుకు ప్రయత్నించారని, నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగుల నియామకం చేశారని మధుసూదన్ రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. సాక్ష్యాలను ధ్వంసం చేస్తున్నారని ప్రభుత్వం ఈ మేరకు తాజాగా విడుదల చేసిన జీవోలో పేర్కొంది. కేంద్ర సర్వీసు నిబంధనలు ఉల్లంఘిం చారని, ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపించింది. కాగా, మధుసూదన్‌రెడ్డి హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లకూడదని రాష్ట్ర ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది. రైల్వే సర్వీసులో ఉద్యోగి ఉన్న మధుసూదనరెడ్డిని జగన్ ప్రభుత్వం డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి తీసుకొచ్చి ఫైబర్ నెట్ కార్పొరేషన్‌కు ఎండీగా నియమించింది. ఇప్పుడు మధుసూదన్ రెడ్డిపై విచారణలో భాగంగా రైల్వే బోర్డు చైర్మన్‌కు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. ఫైబర్ నెట్ లో అక్రమాలపై విచారణ జరుగుతోందని, ఈ విచారణకు మధుసూదన్ రెడ్డి అందుబాటులో ఉండడం కోసం, ఆయన డిప్యుటేషన్‌ను మరో ఆరు నెలలు పొడిగించాలని రైల్వే బోర్డును కోరింది. ఏపీలో మధుసూదన్ రెడ్డి డిప్యుటేషన్ ఈ నెల 22తో ముగియనుంది. ఆయన 2019 ఆగస్టు 26న రైల్వే అకౌంట్స్ సర్వీసు నుంచి డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చారు. అయితే, ఫైబర్ నెట్‌లో అక్రమాలపై విచారణ నేపథ్యంలో, ప్రభుత్వం ఆయనపై చర్యలు తీసుకుంది. ఆయనపై విచారణ జరుగుతున్న విషయాన్ని రైల్వే బోర్డుకు వివరించింది.

#### వెంకటరెడ్డి డిప్యుటేషన్ పొడిగింపు

మరోవైపు... ఏపీఎండీసీ మాజీ ఎండీ వెంకట్ రెడ్డి డిప్యుటేషన్‌ను పొడిగిస్తూ భారత కోస్ట్ గార్డ్ ప్రధాన కార్యాలయం నుంచి ఏపీ ప్రభుత్వానికి లేఖ అందింది. కోస్ట్ గార్డ్ నుంచి ఏపీకి డిప్యుటేషన్‌పై వచ్చిన వెంకటరెడ్డిపై కూడా అవినీతి సంబంధిత ఆరోపణలపై విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో, ఏపీ ప్రభుత్వం లేఖకు కోస్ట్ గార్డ్ స్పందిస్తూ... ఈ నెల 31 వరకు వెంకట్ రెడ్డి డిప్యుటేషన్ పొడిగించినట్టు ఏపీ సీఎస్ కు రాసిన లేఖలో వెల్లడించింది. అంతేకాదు, వెంకట్ రెడ్డి అవినీతిపై కేంద్రానికి ఫిర్యాదు చేశామని కోస్ట్ గార్డ్ కార్యాలయం పేర్కొంది. సర్వీసు నిబంధనల ఉల్లంఘనలపై కేంద్రానికి ఫిర్యాదు చేశామని. ఈ నెల 31న వెంకట్‌రెడ్డి పదవీవిరమణ చేయనున్నారని వివరించింది. తదుపరి చర్యలు రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని సీఎస్ కు రాసిన లేఖలో కోస్ట్ గార్డ్ స్పష్టం చేసింది. ఇసుక, గనుల శాఖలో అక్రమాలపై వెంకట్ రెడ్డిని ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

చైతన్యరథం

# 23న పల్లె పండువ!

- 13 వేల 326 గ్రామ పంచాయితీల్లో ఒకేరోజు గ్రామ సభలు
- రెండు రోజులు ముందే దండోరాతో ప్రచారం చేయండి
- ఉపాధి హామీ పనిదినాల కల్పనపై అవగాహన కల్పించాలి
- 2024-25లో చేపట్టే పనులకు గ్రామసభల ఆమోదం
- లక్ష్యం నెరవేరాలంటే ప్రజలు, అధికారులు మనసుపెట్టాలి
- గ్రామ సచివాలయాల సిబ్బందీ భాగస్వాములవ్వాలి
- సమష్టి కృషితో దేశంలో అగ్రగామిగా నిలుద్దాం
- ఉపాధి పనుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పిలుపు
- జెడ్పీ సీఈవోలు, డీపీవోలు, డ్వామా పీడీలతో వీడియో కాన్ఫరెన్స్



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రవ్యాప్తంగా 13 వేల 326 గ్రామ పంచాయితీల్లో ఆగస్టు 23న ఒకేరోజు గ్రామసభలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి కె పవన్‌కళ్యాణ్ వెల్లడించారు. గ్రామసభలపై సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన జిల్లా పరిషత్ సీఈవోలు, డీపీవోలు, డ్వామా పీడీలు, ఎంపిడీవోలు తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

గ్రామ సభలు విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ పంచాయితీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖల్లో పనిచేయడమంటే గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, నిరుపేద కూలీలకు సేవ చేయడంగా తాను నమ్ముతున్నానన్నారు. పంచాయితీరాజ్ వ్యవస్థలో గ్రామ పంచాయితీ నుంచి జిల్లా పరిషత్ వరకూ పటిష్ఠంగా ఉన్నప్పుడే అనుకున్న అభివృద్ధి సాధించగలుగుతామని తద్వారా మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించగలుగుతామన్నారు. దానిలో భాగంగానే ఈనెల 23న రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు 13వేల 326 గ్రామ పంచాయితీల్లో గ్రామసభలు నిర్వహించడం ద్వారా ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధిహామీ పథకంలో ప్రతి కుటుంబానికి ఏడాదిలో 100 రోజుల పనిదినాలు కల్పనపై అవగాహన, కూలీల హక్కులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పథకం సద్వినియోగానికి పనుల వివరాలు గ్రామ సభలో అర్థమయ్యే రీతిన వివరించాలని సూచించారు. గ్రామ సభ సమాచారాన్ని కనీసం రెండు రోజులు ముందే దండోరాతో ప్రజలందరికీ తెలియజేయడం ద్వారా గ్రామసభ హాజరీ పెంచాలని స్పష్టం చేశారు. అదేవిధంగా డీపీవోలుల గ్రామసభ నిర్వహణపై గ్రామాల్లో సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు.

2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న ఉపాధిహామీ పనులకు సంబంధించి గ్రామసభలో చర్చించి ఆమోదం తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకంలో చేపట్టే పనులు పేద కూలీలకు, రైతులకు, గ్రామానికి ఉపయోగపడేలా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ సూచించారు.

### నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదు

ఉపాధిహామీ పథకం అమలుకు సంబంధించి కొంతమంది డ్వామా పీడీలు గ్రామాలను సందర్శించడం లేదని, పని ప్రదేశాలను తనిఖీ చేయడం లేదని, సోషల్ ఆడిట్ సభలకు హాజరుకావడం లేదని, కిందిస్థాయి అధికారులపై నియంత్రణ లేదనే కొన్ని వాస్తవాలు తన దృష్టికి వచ్చాయని పవన్ కళ్యాణ్ అన్నారు. క్లస్టర్ స్థాయిలో పనిచేసే ఏపీడీలు పని ప్రదేశాలకు వెళ్లడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకమీదట అలాంటి విధానాలను మార్చుకోవాలని సూచించారు. మండల స్థాయిలో పథకం అమలులో పూర్తి బాధ్యత వహించాల్సిన ఎంపీడీవోలు ఇది మనపని కాదన్నట్టు వ్యవహరించడం, కేవలం సంతకాలకే పరిమితం కావడం, పని ప్రదేశంలో మస్టర్లు తనిఖీ చేయకపోవడం వంటి ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిని ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పనికి సంబంధించిన రిజిష్టర్లు, వర్క్‌ఫైల్స్ చాలా మండలాల్లో సరిగ్గా నిర్వహించడం లేదని, ఇక మీదట ఎంపిడిఓలు పూర్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని.. మండల స్థాయిలో జరిగే అవకతవకలకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని పవన్ హెచ్చరించారు.

### బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించండి

ఉపాధిహామీ పథకం అమలుకు సంబంధించి ఏపీఓలు, ఇసిలు, టిఏలు తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించడం లేదని చాలా ఫిర్యాదులు వస్తున్నాయని అలాంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్రామస్థాయిలో పనిచేసే అధికారులు బోగస్ అటెండెన్సు సహా పనికిరాకుండా హాజరు వేయడం, పనిచేయకుండా చేసినట్టు చూపడం, తక్కువ పనిచేసి ఎక్కువ పని నమోదు చేయడం వంటి అవకతవకలు చేస్తున్నట్టు గమనించామని.. అలాంటివి ఇకముందు సహించబోమన్నారు.

పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పెంచాల్సిన సోషల్ ఆడిట్ విభాగంలోనూ అవినీతి జరుగుతుందని ఫిర్యాదులు వస్తున్నాయని, నిఘా విభాగంపైనే నిఘా పెట్టాల్సిన అవసరం వచ్చిందంటే.. పరిస్థితులు ఎంత దిగజారాయో అర్థమవుతోందన్నారు. అవినీతి ఏ స్థాయిలో జరిగినా క్షమించేది లేదని ఫీల్డు అసిస్టెంట్ స్థాయినుండి పీడీ వరకూ సోషల్ ఆడిట్ గ్రామస్థాయి ఆడిటర్ నుంచి రాష్ట్రస్థాయి డైరెక్టర్ వరకూ ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో బాధ్యతాయుతంగా సమర్థవంతంగా పనిచేసే అధికారులు, సిబ్బందిని గుర్తించి వారిని ప్రోత్సహిస్తామన్నారు.

ఇక మీదట ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు మనమందరం సమష్టిగా కలిసి పనిచేసి.. గ్రామాల అభివృద్ధి ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని సాధిద్దామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. సమావేశంలో రాష్ట్ర పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ మాట్లాడుతూ సోషల్ ఆడిట్ పబ్లిక్ హియరింగ్‌కు డ్వామా పీడీలు విధిగా హాజరుకావాలని ఆదేశించారు. ఈ నెల 23 నుంచి జరిగే ప్రత్యేక గ్రామ సభల్లో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, రీచార్జి పిట్‌ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ సంచాలకులు కృష్ణతేజ్, ఈఎన్సీలు బాలూ నాయక్, సంజీవరెడ్డి, వాటర్‌షెడ్ డైరెక్టర్ పీవీఆర్ఎం రెడ్డి, అదనపు కమిషనర్ సుధాకర్ రావు, జాయింట్ కమిషనర్ శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో నూతన ఏపీ టెక్స్ టైల్ పాలసీ




- పెట్టుబడులతోపాటు ఉపాధి కల్పనే లక్ష్యం
- టెక్స్‌టైల్ రంగానికి ఏన్డీయే సర్కారు అనుకూలం
- మౌలిక సదుపాయాల కల్పనకు సిద్ధం
- అగ్రో, జియో, మొబైల్ టెక్స్‌టైల్‌కూ అవకాశం
- రాష్ట్ర చేనేత మరియు జౌళి మంత్రి ఎస్ సవిత

అమరావతి (చైతన్య రథం) త్వరలో నూతన ఏపీ టెక్స్‌టైల్, అపెరల్ మరియు గార్మెంట్స్ పాలసీ తీసుకు రానున్నట్లు రాష్ట్ర చేనేత మరియు జౌళి, బీసీ సంక్షేమ మంత్రి ఎస్ సవిత తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర, రాష్ట్రేతర పెట్టుబడుదారులతో మంత్రి సవిత వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం ఏర్పాటు చేస్తోందన్నారు. ముఖ్యంగా టెక్స్‌టైల్ రంగంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఇందుకోసం మౌలిక వసతుల కల్పనతోపాటు రాయితీలూ విరివిరిగా అందజేయనుందన్నారు. పరిశ్రమల ఏర్పాటులో త్వరతగతిన అనుమతుల ఇవ్వనున్నామన్నారు. టెక్స్‌టైల్ రంగంలో పరిశ్రమల ఏర్పాటు, ఉత్పత్తుల పెరుగుదలకు నూతన ఏపీ టెక్స్‌టైల్, అపెరల్ మరియు గార్మెంట్స్ పాలసీ తీసుకురానున్నట్టు తెలిపారు.

2018-23ఏపీ టెక్స్‌టైల్, అపెరల్ మరియు గార్మెంట్స్ పాలసీని గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం అ పాలసీని పక్కనపడేయడంతో, టెక్స్‌టైల్ రంగంలోని కొత్త పరిశ్రమలు రాకపోగా,ఉన్న పరిశ్రమలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయన్నారు. దీనివల్ల ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపడమేకాకుండా ఉపాధి కల్పనలోనూ ప్రభావం పడిందన్నారు. ప్రస్తుతం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. దీనిలో భాగంగానే టెక్స్‌టైల్ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు నూతన పాలసీ తీసుకురావడమని మంత్రి సవిత తెలిపారు. 2018-23 పాలసీని మరింత మెరుగులుదిద్ది కొత్త పాలసీని తీసుకురానున్నామన్నారు. ఇందుకోసమే పెట్టుబడుదారులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఇచ్చే సలహాలు సూచనలను కొత్త పాలసీలో పొందుపర్చే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో టెక్స్‌టైల్ రంగంలో ఉన్న పరిశ్రమల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

### ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం

దేశంలో సిల్క్ ఉత్పత్తిలో ఏపీ రెండోస్థానంలో, కాటన్ ఉత్పత్తిలో ఆరోస్థానంలో, జనపనార ఉత్పత్తిలో ఏడోస్థానంలో ఉందని మంత్రి సవిత వెల్లడించారు. రాష్ట్రంలో 9 టెక్స్‌టైల్, అపెరల్ పార్కులున్నాయన్నారు. వాటిలో అరు ప్రభుత్వరంగంలో ఉండగా, మూడు ప్రైవేటు రంగంలో ఉన్నాయన్నారు. 146 మెగా టెక్స్‌టైల్ ఇండస్ట్రీలు, 18,500 యూనిట్లు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 15 టెక్నికల్ టెక్స్‌టైల్ కంపెనీల్లో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు, మూడు ఇండస్ట్రీస్ కారిడార్లు ఉన్నాయన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో అగ్రో టెక్స్‌టైల్, జియో టెక్స్‌టైల్, మొబైల్ టెక్స్‌టైల్‌కు అవకాశాలున్నాయన్నారు. రాష్ట్రంలో ఈ అవకాశాలను వినియోగించుకొని రాష్ట్రంలో టెక్స్ టైల్ మరియు అపెరల్ పార్కుల్లో పెట్టుబడులు పెట్టాలని మంత్రి సవిత ఆహ్వానించారు. టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులకు చంద్రబాబు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని, టెక్స్‌టైల్ పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పెట్టుబడులతో పాటు ఉపాధి అవకాశాలు పెంచడమే తమ ప్రభుత్వ నూతన పాలసీ లక్ష్యమన్న మంత్రి సవిత స్పష్టంచేశారు. అంతకుముందు పలువురు స్టేక్ హోల్డర్లు తమ అనుభవాలను, ఆలోచనలతోపాటు పలు సూచనలు చేశారు. తమ సమస్యలను కూడా మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సవిత స్పందిస్తూ, స్టేక్ హోల్డర్ల ఆలోచనలు, సూచనలు కొత్త పాలసీ రూపకల్పనలో పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఆయా సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో చేనేత, జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి కె సునీత, జేడీ శ్రీకాంత్ ప్రభాకర్, రాష్ట్ర, రాష్ట్రేతర పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# జగనన్న భూ సర్వే పెద్ద బోగస్

- గత ప్రభుత్వంలో నష్టపోయిన వారికి న్యాయం చేస్తాం
- ఈ స్థాయిలో బాధితులను చూడటం మొదటిసారి
- చంద్రబాబు, లోకేష్‌ల చొరవతో సమస్యల పరిష్కారం
- అవినీతిని బయటపెడతామనే రికార్డులు తగలబెడుతున్నారు
- ఆయా శాఖల్లో అక్రమాలపై దర్యాప్తు చేయించి శిక్షిస్తాం
- భూ సమస్యల పరిష్కారానికి త్వరలో రెవెన్యూ సదస్సులు
- మా ప్రభుత్వంలో రాజకీయ కక్ష సాధింపు చర్యలు ఉండవు
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ



మంగళగిరి(చైతన్యరథం): ప్రజా వినతుల స్వీకరణలో భాగంగా సోమవారం మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, టీడీపీ నేతలు కంభంపాటి రామ్మోహన్‌రావు, డాక్టర్ శివప్రసాద్‌లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు వింటూ నేరుగా డీజీపీ, కలెక్టర్లు, ఎమ్మెల్యేలకు ఫోన్లుచేసి సమస్యలను వివరించి పరిష్కరించాలని సూచించారు. అనంతరం మీడియాతో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఒక ప్రభుత్వం మారిన తరువాత ప్రజల బాధలను ఈ స్థాయిలో చూడటం ఇదే మొదటిసారని అన్నారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు అర్జీలు ఇవ్వడం, బాధలు చెప్పుకోవడం తప్ప ఏమీ కనిపించడం లేదన్నారు. గత ప్రభుత్వం వ్యవస్థలను చిన్నా భిన్నం చేసి ఒక సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుని సొంత కార్యక్రమాలు చేయడంతో ఈనాడు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. వచ్చే ఫిర్యాదుల్లో అధికంగా భూ సమస్యలపైనే వచ్చాయని తెలిపారు. తాతల తండ్రుల నుంచి వచ్చిన భూములు ఇప్పటికి కూడా వారి ఆధీనంలోనే ఉన్నా రికార్డులు తారుమారు చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఇలాంటి అడ్డగోలు వ్యవహారాలు చేయడం, నిబంధనలు పాటించకపోవడం, జగనన్న భూ సర్వే పేరుతో పెద్ద బోగస్ సర్వే చేపట్టి ప్రజల మధ్య తగాదాలు పెట్టి ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టారని మండిపడ్డారు.

### గత ప్రభుత్వంలో బాధితులకు న్యాయం చేస్తాం

టీడీపీ అధినేత చంద్రబాబు, యువ నాయకుడు లోకేష్‌లు ప్రజా సమస్యల పరి ష్కారం కోసం చేసిన ఆలోచన హర్షణీయమన్నారు. ఒక జిల్లా, ఒక ప్రాంతం కాకుండా రాష్ట్రం మొత్తం భూ సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. దానికి శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్రం ప్రభుత్వం త్వరలోనే రెవెన్యూ అధికారులను గ్రామాలకు పంపి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తుందని వెల్లడించారు. గత ఐదేళ్లలో ఎవరికైతే ఇబ్బంది జరిగిందో వారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్లలో ఎక్కడ అవినీతి జరిగిందో వాటన్నింటిని బయట పెడతామని మేము చెప్పడంతో భయంతో రికార్డులను తగలబెడుతున్నారని తెలిపారు. పోలవరంలో నిర్వాసితులకు,నష్టపోయినవారికి పరిహారంఇవ్వకుండా వైసీపీ నేతల సొంత పార్టీ వారికి విపరీతంగా పరిహారం ఇచ్చి అక్రమంగా దోచుకున్నట్లు తెలిపారు.వాటిని నేడు ప్రభుత్వం బయటకు తీస్తుందన్న ఉద్దేశంతోనే రికార్డులను తగలబెట్టారని చెప్పారు. తిరుపతిలో వెంకన్న ధనాన్ని దోచుకున్నారు అవి బయట పడతాయని ఫైల్స్‌ను దగ్ధం చేశారన్నారు. ఈఘటనలపై తమ పార్టీ అధినేత చంద్రబాబు సీరియస్‌గా ఉన్నారని వెల్లడించారు. గత ప్రభుత్వంలో ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌ను ఐదు జోన్‌లుగా పెట్టి ఒక్కో జోన్‌కు ఒక్కో ఆఫీసర్‌ను నియమించుకుని దోపిడీకి అడ్డు లేకుండా చేసుకుని ఇసుక, మైనింగ్, రేషన్, అక్రమ మద్యం దేన్ని వదలకుండా అక్రమ రవాణా సాగించారు. ఈ దందాకు నాడు ఓ అధికారి సహకరించాడు. ఆయన పేరు చెప్పడం కూడా ఇష్టం లేద ని.. ఇటువంటి దారుణాలపై దర్యాప్తు చేయించి ఎవరు తప్పు చేసినా వారిని విడిచిపెట్టమని స్పష్టం చేశారు. ఎక్సైజ్‌తో పాటు చాలా శాఖల్లో భారీ అవినీతి జరిగిందని అన్నింటినీ బయటపెట్టి అక్రమార్కులను కటకటాల్లోకి నెడతామని వివరించారు.

### వైసీపీ నేతల ఒత్తిడితో తప్పుడు కేసులు

గత ప్రభుత్వంలో తమను కొట్టి తమపైనే అక్రమ కేసులు బనాయించి నానా ఇబ్బందులు పెట్టిన పోలీసు అధికారులు మళ్లీ ముసుగు తొలగించుకుని పదవులు పొం దుతున్నారని, గత ఐదేళ్లు వైసీపీ నేతల అడుగులకు మడుగులొత్తిన ఆ పోలీసుల ముసుగులు తొలగించి చర్యలు తీసుకోవాలని మైదుకూరుకు చెందిన టీడీపీ నేతలు మంత్రి అచ్చెన్నాయుడికు ఫిర్యాదు చేశారు. తమను కొట్టిన పోలీసుల ఫొటోలను చూపి స్తూ వారిపై చర్యలు తీసుకోవాలని, వారికి పదవులు దక్కకుండా చూడాలని కోరారు.

### పోలీసు అధికారి దందా.. రూ.60 లక్షల వసూలు

తాము మాచర్ల నియోజకవర్గంలో లేకపోయినా హైదరాబాద్‌లో ఉన్న వ్యక్తిపై అక్రమ కేసు పెట్టి సుమారు రూ.60లక్షలు గత ప్రభుత్వంలో వైసీపీకి కొమ్ముకాసిన ఓ పోలీసు అధికారి వసూలు చేశాడని అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని పల్నాడుజిల్లా మాచర్ల నియోజకవర్గం రెంటచింతలకు చెందిన రవికిరణ్‌రెడ్డి, అప్పిరెడ్డి, సుమంత్‌రెడ్డిలు వేడుకున్నారు.అలాగే తాము చేసిన వర్క్ బిల్లులు రాలేదని వాటిని ఇప్పించాలని వాపోయారు. నర్సరీల కోసం రైతుల దగ్గర భూమి తీసుకునేందుకు గత ప్రభుత్వం తెచ్చిన రిజిస్ట్రేషన్ జీవోను రద్దు చేయాలని కోరారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన అగ్రిమెంట్ విధానంను అమలు చేయాలని కోరారు.

### జగనన్న భూ సర్వేలో ప్రభుత్వ భూమిగా మార్చారు

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం కొండాపురానికి చెందిన ఎన్.సంజీవ వరప్రసాద్ తన సమస్యను వివరిస్తూ గత ప్రభుత్వం చేపట్టి జగనన్న భూ సర్వే వల్ల తమ భూమిని ప్రభుత్వ భూమిగా మార్చారని, దాంతో తమకు అడంగల్ రావడంలేదని వాపోయాడు. సమస్యను పరిష్కరించాలని కోరాడు. గత ప్రభుత్వంలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తోన్న రెగ్యులర్ ఏఎన్‌ఎంలకు వైసీపీ అన్యాయం చేసిందని.. ఎప్పటి నుండో స్వస్థలాల్లో పనిచేస్తున్న తమను దూర ప్రాంతాల్లో వేసి సచివాలయాల్లో కొత్త వారిని తీసుకొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

### వైసీపీ నేత నుంచి ప్రాణహాని ఉంది

వైసీపీ నాయకులు కోటేరు ముత్తారెడ్డి నుంచి తన కుటుంబానికి ప్రాణహాని ఉందని.. తనకు రావాల్సిన డబ్బులు అడిగినందుకు తమపై దాడులు చేసి గ్రామం నుంచి వెలివేశారని నందిగామ నియోజకవర్గం వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన నిప్పులపల్లి కోటేశ్వరరావు వాపోయాడు. ఆరు నెలలు తెలంగాణాలో ఉన్నామని ఊరిలో తమతో ఎవరూ మాట్లాడనివ్వకుండా.. మంచినీళ్లు, సరుకులు ఇవ్వకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎస్సై వైసీపీ నాయకులకే మడుగులొత్తుతున్నాడని తమకు న్యాయం చేయాలని కోరాడు. దీనిపై మంత్రి నందిగామ ఎమ్మెల్యేకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

### భూమి ఆక్రమించుకున్న వైసీపీ నేతలు

ప్రభుత్వం తమకు ఇచ్చిన భూమిని వైసీపీ నేతలు అక్రమంగా ఆన్‌లైన్ చేసుకుని పట్టా తీసుకున్నారని ప్రకాశంజిల్లా కురిచేడు మండలం పడమర వీరాయపాలెం గ్రామస్తుడు జెల్లి మస్తాన్ వాపోయాడు. 1983 లో ఆ భూమిని ప్రభుత్వం తన తండ్రికి ఇచ్చిందని.. ఆయన మరణాంతరం ఆభూమిని తాము అనుభవిస్తున్నామని తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరాడు.

### లక్షకు రూ.10 లక్షలు వడ్డీ కట్టమని వేధిస్తున్నారు

రూ.2 వడ్డీకి రూ.50వేలు తీసుకుంటే దానికి రూ.3 లక్షలు కట్టమని వైసీపీ నేతలు బెదిరిస్తున్నారని తమను ఊరిలోకి రానివ్వడం లేదని.. డబ్బులు కట్టకుంటే చంపుతామని బెదిరిస్తున్నారని మంత్రాలయానికి చెందిన్న జమ్మన ఫిర్యాదు చేశాడు. మం త్రాలయానికి చెందిన మరో వ్యక్తి బుడగ జంగం కూడా ఫిర్యాదు చేస్తూ వైసీపీ నేత భీమా దగ్గరతీసుకున్న లక్షకు రూ.10 లక్షలు వడ్డీ కట్టమని బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశాడు.

### అంబేద్కర్ భవన స్థలాన్ని కబ్జా చేశారు

బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం మార్టూరులోని నేతాజీనగర్ కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తూ వైసీపీ నేతల అండతో గత ప్రభుత్వంలో అంబేద్కర్ భవన నిర్మాణ స్థలాన్ని ఆక్రమించుకుని కట్టడాలు చేపట్టారని.. అక్రమ కట్టడాలు తొలగించి ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లికి చెందిన పొలమరశెట్టి మురళీకృష్ణ ఆవేదన వ్యక్తం చేస్తూ తాను టీడీపీలో ఉత్సాహంగా పనిచేస్తున్నా ననే కారణంతో గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు తనపై అక్రమ కేసులు పెట్టారని కేసులు తొలగించాలని వేడుకున్నాడు.







## వెలుగొండపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు: మంత్రి డోలా



అమరావతి(చైతన్యరథం): పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డికి వెలుగొండ ప్రాజెక్టు గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు కొట్టుకుపోతే ఆ గేటు పెట్టలేని జగన్.. చంద్రబాబు గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కాకుండానే పూర్తి చేసినట్టు జాతికి అంకితం చేసి జగన్ రెడ్డి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాడని మంత్రి డోలా దుయ్యబట్టారు. వెలుగొండ సొరంగం వ్యాసాన్ని జగన్ రెండున్నర మీటర్లు తగ్గించారని విమర్శించారు. గత ఐదేళ్లలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వలేకపోయారని జగన్ పరోక్షంగా ఒప్పుకున్నారు, ఈ పాపం జగన్ ది కాదా? 2019లో జగన్ మాయమాటలు నమ్మి ప్రజలు గెలిపిస్తే వారిని మోసం చేశారు. ఈసారి ప్రకాశం జిల్లా ప్రజలు జగన్ ఫేక్ ప్రచారాన్ని తిప్పి కొట్టారు. ప్రజలు బుద్ధి చెప్పినా జగన్ తన తీరు మార్చుకోకుండా పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారు. జగన్ ఇకనైనా తప్పుడు ప్రచారం మానుకోవాలని ఒక ప్రకటనలో మంత్రి డోలా స్పష్టం చేశారు.

## వెనుకబడిన వర్గాలకు

# విద్య, వైద్యంలో బాధ్యతగా వ్యవహరించాలి

- గురుకులాలు, వసతిగృహాల్లో పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలి
- శాఖ ఉద్యోగులు మెరుగైన ఫలితాలు సాధించేలా కృషిచేయాలి
- ఎస్సీల ఆదాయం పెంపునకు ప్రణాళికలు రూపొందించాలి
- త్వరలో ఎస్సీ విద్యార్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇస్తాం
- గురుకులాల్లో సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తాం
- జగన్ రద్దు చేసిన ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తాం
- సెప్టెంబరు మొదటివారం నుంచి జిల్లాల్లో పర్యటిస్తాం
- సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి




గుంటూరు(చైతన్యరథం): వెనుకబడిన వర్గాలకు విద్య, వైద్యం, ఆరోగ్యం అందించడంలో సాంఘిక సంక్షేమ శాఖ పనితీరు కీలకమని, ఉద్యోగులు మెరుగైన ఫలితాలు సాధించేలా బాధ్యతతో పనిచేయాలని రాష్ట్రసాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సూచించారు. సోమవారం గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుకుల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నాయుడు పేట గురుకుల పాఠశాలలో పరిశుభ్రత లేమి కారణంగా బ్యాక్టీరియా వల్ల ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని, ఇటువంటి ఘటనలు పునరావృతం కావడానికి వీలు లేదని స్పష్టం చేశారు. గురుకుల పాఠశాలలు, వసతిగృహాల్లో ప్రతినెలా హెల్త్ చెకప్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలని,వారిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. చదువులో వెనుక బడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అధికారులు తరచుగా తనిఖీలు నిర్వహించాలని ఆదే శించారు. రిమోట్ ఏరియాల్లోని గురుకుల పాఠశాలల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. జిల్లా కేంద్రాల్లో ఎస్సీ విద్యార్థులకు మూడునెలల పాటు ఉచితంగా డీఎస్సీ శిక్షణ అందిస్తామని తెలిపారు. అంబేద్కర్ ఓవర్సీస్ విదేశీ విద్యతో పాటు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలైన ఎస్సీ సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరిస్తామని తెలిపారు.

### ఎస్సీల తలసరి ఆదాయం పెంచేలా ప్రణాళికలు

ఏ సౌకర్యాలు లేని రోజుల్లోనే అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్‌లు ఉన్నత స్థానానికి ఎదిగా రని, ప్రతి హాస్టల్లో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ ఫొటోలు ఉండాలని సూచించారు. ఉద్యోగులు కష్టపడి పనిచేసి మెరుగైన ఫలితాలు తీసుకురావాలని,ఇందుకు అవసరమైన చోట సచివాలయ ఉద్యోగుల సహకారం తీసుకోవాలని సూచించారు.

ఉద్యోగులకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఎస్సీల్లో తల సరి ఆదాయం పెంచేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వచ్చే నెల మొదటి వారం నుంచి అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, మోడల్ విలేజెస్ పరిశీలించనున్నట్లు తెలిపారు.

### వంద రోజుల యాక్షన్ ప్లాన్

అనంతరం వందరోజుల యాక్షన్ ప్లాన్‌ను మంత్రికి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలోని 1051 హాస్టళ్లలో 86 వేల సీట్లలో 32 వేల సీట్లు ఖాళీలు ఉన్నాయని వాటిని సెప్టెంబరు లోగా భర్తీ చేస్తామని తెలిపారు. గురు కుల పాఠశాలలు, వసతిగృహాల్లో రూ.143 కోట్లతో మైనర్, మేజర్ రిపేర్లు చేయాల్సి ఉందన్నారు. ప్రతి వసతి గృహంలో ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి, ఎన్టీఆర్ విద్యోన్నతి, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, కార్పొరేట్ కాలేజెస్ స్కీం, బుక్ బ్యాంకు టీం వంటి పథకాలన్నీ పునరుద్ధరిస్తామని వివరించారు. గత ఐదేళ్లలో హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు కూడా అందించలేదని వాటిని తిరిగి అందిస్తామన్నారు. రూ.190 కోట్లతో గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో డార్మెటరీలు, కిచెన్లు పునర్నిర్మాణం చేయాల్సి ఉందని తెలిపారు. కొన్ని చోట్ల నాన్ టీచింగ్ స్టాఫ్‌ను భర్తీ చేయాల్సి ఉందని చెప్పారు. నరేగా నిధులతో గురుకులాల్లో కాంపౌండ్ వాల్స్, మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టి.కన్నబాబు, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రసన్న వెంకటేష్,అన్ని జిల్లాల సాంఘిక సంక్షేమ అధికారులు, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



# సీఎం చంద్రబాబుపై ప్రజల్లో మరింత విశ్వాసం

- లోటు బడ్జెట్‌లో ఉన్నా రైతులు, ప్రజలకు అండ
- గత ప్రభుత్వ నిర్ణయాలతో పాల సంఘాల నాశనం
- మైలవరం సమగ్రాభివృద్ధికి ఎమ్మెల్యేతో కలిసి చర్యలు
- త్వరలో గొల్లపూడి దగ్గర వెస్టన్ బైపాస్ పనులు
- ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్ దగ్గర కృష్ణా హారతి
- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్
- అనంతవరంలో పాల కేంద్రానికి ప్రారంభోత్సవం



మైలవరం(చైతన్యరథం): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు అందజేయటం, రాజధాని అమరావతి నిర్మాణం కోసం చర్యలు మొదలుపెట్టడంతో ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వంపై మరింత విశ్వాసం, నమ్మకం పెరిగిందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గం అనంతవరంలో మహిళా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకారసంఘం నిర్మించిన నూతన పాలకేంద్రం భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి పాలకేంద్ర భవనాన్ని ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే, ఎంపీలను ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కేశినేని మాట్లాడుతూ ఎన్టీఆర్ కృషి వల్లే నేడు గ్రామాల్లో పాలసహకార సంఘాలు కొనసాగుతున్నాయన్నారు.రాష్ట్ర ఆర్థికపరిస్థితి లోటుబడ్జెట్‌లో ఉన్నా రైతులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా ఉంటున్నారని తెలిపారు. గతప్రభుత్వం రాష్ట్రంలో అమూల్ లాంటి కార్పొరేట్ సంస్థలను తెచ్చి పాలసహకార సంఘాలను నాశనం చేయాలని ప్రయత్నించిందన్నారు.. రైతులందరూ ఎన్ని కష్టాలు ఎదురైనా ఒక మాట మీదనిలబడి ఉన్నందుకు అభినందనలు తెలిపారు. రైతులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటూ సహ కారం అందించిన కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ సి. హెచ్.ఆంజనేయులు కృషిని కొనియాడారు. రాజధాని అమరావతితో పాటు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలిసి మైలవరం సమాగ్రాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. త్వరలో ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్ వద్ద కృష్ణానది హారతి కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు.అలాగే గొల్లపూడిదగ్గర వెస్టన్ బైపాస్ పనులు ప్రారంభంకాబోతున్నాయని తెలిపారు.

### అమూల్ సంస్థకు ఆస్తులు కట్టబెట్టారు

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో తొలిసారిగా ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి పాల కేంద్ర భవనం ప్రారంభించటం సంతోషంగా ఉందన్నా రు. ఎన్నికల సమయంలో రాజకీయాలు చేయాలి...ప్రజాప్రతినిధులు మిగిలిన సమయం లో అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. అయితే గత ప్రభుత్వం ఈ విషయం మరిచిపోయి పాలన సాగించిందన్నారు. జగన్ పాల సహకారం సంఘాలను నిర్వీర్యం చేయాలని చూశాడని, అందుకే ప్రజలు గద్దె దింపి బుద్ధి చెప్పారన్నారు. అమూల్ సంస్థకు వేలాది కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులు జగన్ కట్టబెట్టాడని తెలిపారు. ప్రజలంతా ఏకంగా ఉంటే ప్రజాస్వామంలో ఏ వ్యవస్థను ఏమీ చేయలేరన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గూగులోతు కోటమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు తాతా పోతురాజు, రాష్ట్ర నాయకులు జంపాల సీతారామయ్య, సీనియర్ నాయకులు బొందలపాటి సుధాకర్, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ సి. హెచ్.ఆంజనేయులు, అనంతపురం పాల కేంద్ర సొసైటీ అధ్య క్షురాలు బొందలపాటి శైలజ, కృష్ణా జిల్లా యూనియన్ డైరెక్టర్ ఈశ్వర్‌బాబు, జిల్లా యూనియన్ పాలకవర్గ సభ్యులు ఉయ్యూరు అంజిరెడ్డి, చెరుకూరి ఝాన్సీరాణి తదిత రులు పాల్గొన్నారు.

## ప్యాలెస్‌లో కూర్చుని తప్పుడు ట్వీట్లు..

# సిగ్గులేదా జగన్?

- దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా వెలుగొండపై మాటలు
- జగన్‌కు ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కౌంటర్



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో జలవనరుల శాఖ అత్యంత నిర్లక్ష్యానికి, విధ్వంసానికి గురైంది జగన్ హయాంలోనే అని, ఇది దాచేస్తే దాడని నిజమని ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అన్నారు. వెలుగొండ ప్రాజెక్టుపై ట్విట్టర్‌లో జగన్ చేసిన ట్వీట్ కు ఎమ్మెల్యే జనార్ధన్ ఘాటుగా స్పందించారు. వెలుగొండ ప్రాజెక్టు గురించి పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. ఫేక్ రాజకీయంతో లబ్ధి పొందాలనుకునే జగన్ దుర్మార్గపు ఆలోచనలను ప్రజలు విశ్వసించరన్నారు. గత ఐదేళ్లలో మిగిలిన 10 నుండి 20 శాతం పనులు పూర్తిచేసి వెలుగొండ ద్వారా నీళ్లివ్వలేకపోయిన జగన్ రెడ్డి నేడు బెంగళూరు యలహంక ప్యాలెస్‌లో కూర్చుని ట్వీట్లు చేయడానికి సిగ్గనిపించడం లేదా అని నిలదీశారు. సలహాదారులకు, సాక్షి పత్రికకు, సర్వే రాళ్లపై బొమ్మలకు చేసిన ఖర్చు ఎంతో...సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేసింది ఎంతో దమ్ముంటే ప్రకటించాలని సవాల్ విసిరారు. సాగునీటి రంగానికి, రాష్ట్ర రైతాంగానికి జగన్ ఐదేళ్ల పాపపు పాలన ఒక శాపంగా మారిందన్నారు. ఈ సంగతి ఫేక్ రాజకీయం చేసే, అంతరాత్మే లేని జగన్‌కు తప్ప రాష్ట్రంలోని ప్రతి పౌరుడికీ తెలుసన్నారు. తప్పుడు ప్రచారంతో ఎల్లకాలం రాజకీయం సాగదు అని జగన్ గుర్తుంచుకోవాలని ఒక ప్రకటనలో జనార్ధన్ హితవు పలికారు.

చైతన్యరథం

# గుంటూరు మిర్చి యార్డులో భారీ అవినీతి

- సెస్ రూపంలో రూ.400 కోట్ల ఆదాయానికి గండి
- జీరో వ్యాపారం, ధరల కోతతో రూ.2 వేల కోట్లు స్వాహా
- వ్యాపారుల లైసెన్సుల రెన్యువల్‌లోనూ అక్రమ వసూళ్లు
- మిల్లుల వద్ద ముడుపులతో యథేచ్ఛగా కల్తీ కారం వ్యాపారం
- రైతులకు వివిధ రూపాల్లో రూ.100 కోట్లు ఎగ్గొట్టారు
- ఉద్యోగుల సహకారంతో వైసీపీ నేతల దోపిడీ వ్యవహారం
- విచారణ జరిపించాలని మంత్రికి మాజీ చైర్మన్ వినతి
- ఐదేళ్ల అక్రమాలను వెలికితీసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



అమరావతి(చైతన్యరథం): గుంటూరు మిర్చియార్డులో గత ఐదేళ్లుగా చేసిన వైసీపీ నేతల అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. మిర్చి యార్డులో దోపిడీ, అక్ర మాలపై విచారణ జరిపించాలని మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నం సుబ్బారావు, అసోసియేషన్ నాయకుడు రామకృష్ణ సోమవారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ప్రజా వినతుల కార్యక్రమంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేశారు. గత ఐదేళ్లు జరిగిన దోపిడీ వివరాలను వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండళ్లలో సుదీర్ఘకాలం కాంగ్రెస్, వైసీపీకి చెందిన నేతలే ఉన్నారు. దీంతో విచ్చలవిడిగా దిగుమతి లైసెన్సులు మంజూరుచేశారు. దీనివల్ల మిర్చి దిగుమతి అసోసియేషన్, హమాలి, వేమన్ యూనియన్లలో మెజార్టీ సభ్యులు వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారు. అక్కడున్న వ్యాపారుల నుంచి నయానో, భయానో చందాలు, మామూళ్లు వసూలు చేస్తూ ఈ డబ్బుతో అసాంఘిక కార్యకలాపాలు, దౌర్జన్యాలు, దొమ్మీలు చేస్తున్నారని ఫిర్యాదులో వివరించారు.

### ఆదాయానికి గండి.. జీరో వ్యాపారంతో స్వాహా

ఫిర్యాదులో మిర్చి యార్డు ఉద్యోగుల అవినీతిని వివరించారు. అక్కడ పనిచేస్తున్న సెక్రటరీ ఐ. వెంకటేశ్వర్‌రెడ్డి, పదోన్నతి పొంది ప్రస్తుతం సత్తెనపల్లిలో గ్రేడ్-2 సెక్రటరీగా పనిచేస్తున్న కె.శివారెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ కె.జయరామిరెడ్డి, వి.ఆనంద్ భాస్కర్, సూప ర్‌వైజర్లు గద్దం శివారెడ్డి, సి.హెచ్. శివారెడ్డి, కె.సాంబిరెడ్డి, ఫిరంగిపురంలో పనిచేస్తున్న వి.శ్రీకాంత్, షేక్ కరీమ్ అక్రమంగా భారీగా డబ్బులు వసూలు చేశారు. గుంటూరు మిర్చి యార్డులో ప్రతి ఏడాది రూ.16వేల కోట్ల లావాదేవీలు జరుగుతాయి. ఇందుకు ఒక శాతం సెస్ రూపంలో ఏడాదికి రూ.160 కోట్లు రావాలి. అయితే సగం పైగా జీరో వ్యాపారం, ధరల తగ్గింపుతో ఏడాదికి సుమారు రూ.80కోట్ల నష్టం జరిగింది. ఈ ఐదేళ్లలో రూ.400కోట్లు మార్కెట్ ఆదా యానికి గండి పడింది. దీనికితోడు 5 శాతం జీఎస్టీ రావాల్సి ఉన్నా ఆ ఆదాయానికి కూడా గండి పడింది. ఏడాదికి రూ.800 కోట్ల చొప్పున ఐదేళ్లకు రూ.4,000 కోట్లు జమకావాల్సి ఉండగా కేవలం రూ.2,000 కోట్లు మాత్రమే జమైంది. రూ.2,000 కోట్లు జీరో వ్యాపారం, ధర కటింగ్ రూపంలో స్వాహా చేశారని తెలిపారు.

### లైసెన్సుల రెన్యువల్‌లో దోపిడీ

కొంతమంది కమీషన్ వ్యాపారులకు ఈ కొనుగోలు యాప్ ద్వారా షాపులు కేటా యించారు. కేటాయించిన షాపులకు ఎస్ఎఫ్‌టీ ద్వారా అద్దె నిర్ణయించారు. అయితే అద్దె ఎక్కువగా ఉందని వ్యాపారుల కోరిక మేరకు రూ.1.50లక్షలు తీసుకుని 50శాతం అద్దె మినహా యింపు ఇచ్చారు. 2023-2028 సంవత్సరానికి సెక్రటరీ ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి, అప్పటి ఇన్‌చార్జ్ చైర్మన్‌గా ఉన్న సుధాకర్‌రెడ్డి కమీషన్ వ్యాపారుల 400 లైసెన్స్‌లు రెన్యువల్ చేశారు. దీనికి ఒక్కొక్క వ్యాపారి నుంచి రూ.25వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేశారు. మార్కెట్ యార్డ్‌లో సుమారు 180 మంది కమీషన్ వ్యాపారులకు సంబంధించిన పార్టనర్ షిప్ డీడ్‌ను మార్చి, లైసెన్స్‌లు బదిలీ చేయడానికి ఒక్కొక్కరి నుంచి రూ.లక్షకు పైగా వసూలు చేశారు. యార్డ్‌కు వచ్చిన సరుకుకు, రికార్డులలో నమోదుచేసిన సరుకుకు సంబంధం లేదు. ఈ-నామ్‌లో తక్కువగా నమోదు చేసి జీరో, బిల్లు టూ బిల్లు, కట్ బిల్ వ్యాపారాలను బాగా ప్రోత్సహించి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేశారు. మార్కెట్ యార్డ్‌లో వ్యాపారులకు సీజన్‌లో అదనపు ప్లాట్స్ కేటాయిస్తూ అద్దెతోపాటు ఫీజుటూ ఫీజు సొమ్మును వసూలు చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కారం మిల్లుల వద్ద ముడుపులు తీసుకుంటూ యథేచ్ఛగా కల్తీ కారాన్ని ప్రోత్సహించారు.

### విధులు నిర్వహించకుండానే జీతాలు

పదిమంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు మార్కెట్ యార్డులో విధులు నిర్వహించకుండా జీతభత్యాలు పొందుతున్నారు. వారు వైసీపీ పార్టీ కోసం పనిచేస్తున్నారు. అందులో ముగ్గురు మాచర్ల నుంచి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సిఫారసు ద్వారా ఉద్యో గాలు పొందారు.కనీసం రిజిస్టర్‌లో సంతకాలు చేయకుండానే జీతాలు తీసుకుంటున్నారు. మరొకరు కలెక్టర్ కార్యాలయం నుంచి సోషల్ మీడియా ద్వారా టీడీపీకి వ్యతిరేకంగా, వైసీపీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాడు. ఆధారాలతో సహా జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయగా అతడిని విధుల నుంచి తొలగించారు. వీరందరి దగ్గర నుంచి సిఫార్సులతో పాటు ముడుపులు తీసుకుని ఔట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు ఇచ్చారు.

### రైతులకు రూ.100 కోట్లు ఎగ్గొట్టారు

ఈ ఐదేళ్లలో వ్యాపారులు వివిధ రూపాల్లో సుమారు రూ.100కోట్లు రైతులకుఎగ్గొట్టారు.కొంతమంది వ్యాపారులు వైసీపీ నేతల అండదండలతో దివాలా తీసినట్లు ఐపీ దాఖలు చేశారు.వాస్తవానికి వారు నష్టపోకపోయినా రైతులకు ఎగ్గొట్టేందుకు ఇలాంటి మోసాలకు పాల్పడ్డారని, వాటన్నింటిని తిరిగి నష్టపోయిన రైతులకు ఇప్పించాలని మిర్చి యార్డు మాజీ చైర్మన్ కోరారు. 2019జూన్, జూలై, అగస్టు మాసాల్లో రూ.15వేల కోట్ల విలువచేసే క్రయ విక్రయాలు మొత్తం అక్రమంగా జరిగాయని ఫిర్యాదులో వివరిం చారు. అప్పట్లో దీనిపై మొక్కుబడి విచారణ జరిగిందే తప్ప ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని.. రికార్డుల్లో లావాదేవీలను తారు మారు చేశారని పేర్కొన్నారు. ఈ కోట్లాది రూపాయల కుంభకోణానికి అప్పటి మార్కెట్‌యార్డ్ ఇన్‌చార్జ్ సెక్రటరీగా పనిచేసిన ఎన్.శ్రీనివాసరావు(డిప్యూటీ డైరెక్టర్) బాధ్యులని తెలి పారు. ప్రస్తుతం ఇతను దుగ్గిరాల మార్కెట్ యార్డ్‌లో సెక్రటరీగా పనిచేస్తున్నారని, ఇతనికి మరో 10మంది సూపర్‌వైజర్లు సహకరించారని తెలిపారు. ఈ అంశంపై పునర్విచారణ జరిపించి అందుకు బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

### మార్కెట్ యార్డ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారం

ఇటీవల జరిగిన ఎన్నికల్లో యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించి అధికారులు, కమీషన్ వ్యాపారులు వైసీపీకి తమవంతు సహాయ సహకారాలు అందించారని పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదు. కానీ దీనికి భిన్నంగా గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, గుంటూరు తూర్పు, ప్రత్తిపాడు వైసీపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహించి సభలు, సమావేశాలు పెట్టారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమా వళిని ఉల్లంఘించడమే అవుతుంది. వీటిపై ఫిర్యాదుచేయగా నామమాత్రపు చర్యలు తీసుకున్నారు. అసలు దోషులు జేడీ కమ్ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ శ్రీనివాసరావు, మరికొంత మంది సూపర్‌వైజర్లను వదిలేశారు. ఎన్నికల సమయంలో మిర్చియార్డ్‌లో పని చేస్తున్న డీఈవో ఖాదర్ బాషా సోషల్ మీడియాలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నరేంద్ర మోదీపై అసభ్యకరమైన పోస్టులు పెట్టారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయగా అతడిని విధుల నుంచి తొలగించారు. అయినా అధికారులకు డబ్బు ఆశచూపి విధుల్లో చేసేందుకు ప్రయత్నం చేస్తూ మార్కెట్ యార్డ్‌ను వైసీపీ ఎన్నికల కార్యాలయంగా మార్చారు. గత ఐదేళ్లలో మిర్చి యార్డ్‌లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులు, సూపర్‌వైజర్లపై విచారణ జరిపించాలని, నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

---

వెలుగొండ ప్రాజెక్టు గురించి

## మాట్లాడే అర్హత జగన్‌రెడ్డికి లేదు

యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు



యర్రగొండపాలెం (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ... జగన్మోహన్ రెడ్డికి వెలుగొండ ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత లేదని, పశ్చిమ ప్రాంత ప్రజలను మోసం చేసి పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును పూర్తయినట్లు ఈ ప్రాంత ప్రజలను నమ్మబలకాలని చూశాడని మండిపడ్డారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద 2019లో 18 లక్షల ప్యాకేజీ ఇస్తామని వెలుగొండ ముంపు నిర్వాసితులకు మాయమాటలు చెప్పి ఇప్పటికి ఇవ్వకుండా వాళ్ళను నట్టేట ముంచారని జగన్ పై మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం జలవనరుల శాఖ గెజిట్‌లో వెలుగొండ ప్రాజెక్టు చేర్చమని పదేపదే అడిగిన స్పందించని మీరు ఆరోజు మేము ప్రతిపక్షంలో ఉండి కూడా కేంద్రాన్ని కోరి వెలుగొండ ప్రాజెక్టును గెజిట్ లో చేర్పించిన్న ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు. తుతూ మంత్రంగా పూర్తికాని ప్రాజెక్టు పూర్తైనట్లు చూపించి ప్యాలెస్‌లో కూర్చొని ట్వీట్లు చేసి వెలుగొండ ప్రాజెక్టు గురించి మాకు గుర్తుచేయడం హాస్యాస్పదమని ఎరిక్షన్ బాబు ధ్వజమెత్తారు.

---

అమెరికా పర్యటనలో ఎమ్మెల్యే రాముకు అపూర్వ స్వాగతం పలికిన తెలుగు సంఘాలు

## గుడివాడ అభివృద్ధికి ఎన్ఆర్ఐలు సహకరించాలి: ఎమ్మెల్యే రాము



గుడివాడ (చైతన్యరథం): కుటుంబ వివాహ కార్యక్రమంలో పాల్గొనేందుకు అమెరికా వెళ్లిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు అక్కడి ఎన్ఆర్ఐలు ఘన స్వాగతం పలికారు. అట్లాంటా ఎయిర్ పోర్టులో దిగిన వెంటనే తానా, తెలుగు అసోసియేషన్ సభ్యులు ఆలింగనం చేసుకుంటూ ఎమ్మెల్యే రామును అభినందించారు. అనంతరం డౌన్ టౌన్ పార్క్ నుంచి అలెగ్జాండర్ డ్రైవ్ అల్ఫారేటా వరకు జై వెనిగండ్ల రాము నినాదాలతో, టీడీపీ జెండాలతో అమెరికా వీధుల్లో ఎన్నారైలు 100 కార్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తానా మరియు తెలుగు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో పాల్గొనేందుకు వచ్చిన రాముకు మంగళ హారతులతో స్వాగతం పలుకుతూ, పూల మాలలు, జ్ఞాపికలతో అభినందనలు తెలిపారు. అనంతరం ఎన్నారైలు ఏర్పాటుచేసిన విజయోత్సవ కేక్‌ను రాము కట్ చేశారు. అమెరికాలో ఉన్నత స్థాయిలో ఉన్న, సర్వ సుఖాలు వదులుకొని మండుటెండలను సైతం లెక్కచేయకుండా గుడివాడ అభివృద్ధి కోసం పోరాడి గెలుపొందిన రాము విజయాన్ని ఎంత కీర్తించిన తక్కువేనని సమావేశంలో పాల్గొన్న తానా పెద్దలు కొనియాడారు. మంచి లక్ష్యంతో రాము సాధించిన విజయం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని... గుడివాడ అభివృద్ధికి భవిష్యత్తులో రాము చేసే కార్యక్రమాల్లో తాము కూడా భాగస్వామ్యం అవుతామని ఈ సందర్భంగా తెలుగు అసోసియేషన్ పెద్దలు హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు నమ్మకాన్ని నిలబెట్టేలా గుడివాడ ప్రజల ఆశీస్సులతో రికార్డు స్థాయి విజయం సాధించడం తనకు సంతోషంగా ఉందని సమావేశంలో ఎమ్మెల్యే రాము అన్నారు. ఇప్పటి నుంచే తనపై అసలైన బాధ్యత మొదలైందని.... ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా గుడివాడ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని అన్నారు. 20 ఏళ్ల పాటు వెనుకబడిన గుడివాడను అభివృద్ధి చేయడం తన ఒక్కడి వల్ల అయ్యే పని కాదన్నారు. గుడివాడ అభివృద్ధికి తాను చేస్తున్న కృషి, ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి తోడుగా భవిష్యత్తులో మీరందరూ సహకరించాలని సమావేశంలో పాల్గొన్న ఎన్ఆర్ఐలకు రాము విజ్ఞప్తి చేశారు. కోలాహలంగా జరిగిన రాము అభినందన కార్యక్రమంలో తానా, తెలుగు అసోసియేషన్ సంఘాల పెద్దలు, గుడివాడ, కృష్ణాజిల్లా ప్రాంతాలకు చెందిన పలు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



◆ఎమ్మెల్యే గద్దె రామమోహన్

◆నెల్సన్ మండేలా పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

◆సమస్యలు చెప్పిన వారం రోజుల్లోనే పరిష్కారానికి చర్యలు

◆ఆనందం వ్యక్తం చేస్తున్న డివిజన్ వాసులు



విజయవాడ, చైతన్యరథం: ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. నియోజకవర్గ పరిధిలో గంజాయి సేవించడం, బహిరంగంగా మద్యం తాగడం వంటివి జరగకుండా పూర్తి స్థాయిలో నియంత్రిస్తామని చెప్పారు. 4వ డివిజన్‌లోని నెల్సన్ మండేలా పార్కులో ఉన్న వివిధ సమస్యల పరిష్కారానికి నిధులను మంజూరు చేయించిన ఎమ్మెల్యే గద్దె సోమవారం స్థానికులతో కలిసి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.

అనంతరం ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి గత వారం ఈ డివిజన్లో పర్యటించిన సమయంలో స్థానికంగా ఉంటున్నవారు పలు సమస్యలను తెలియజేశారని చెప్పారు. స్థానికంగా ఉన్న నెల్సన్ మండేలా పార్కు సమీపంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, వేరే ప్రాంతం నుంచి యువకులు ఈ ప్రాంతానికి వచ్చి గంజాయి సేవిస్తున్నారని స్థానికులు చెప్పారన్నారు. స్థానికులు ఆ యువకులను ప్రశ్నిస్తే ఎదురుతిరిగి గొడవపడుతున్నారని, కాలనీలో ఈవిధమైన వివాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానిక మహిళలు తనకు తెలియజేశారని అన్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని, మద్యం తాగడంతో పాటు పార్కు లోపలకు వాహనాలను తీసుకువస్తున్నారని దీనివల్ల వాకింగ్ చేసుకోవడం చాలా కష్టంగా ఉందని తెలిపారన్నారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించడంతో పాటు పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించి స్థానికులకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా చేస్తామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హామీ ఇచ్చారు.

కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు మాట్లాడుతూ గత వారం రోజుల క్రితం నెల్సన్ మండేలా పార్కులో వాకింగ్ చేయడం కష్టంగా ఉందని, షటిల్ ఆటడం కూడా సాధ్యం కావడం లేదని స్థానికులు, తాము ఎమ్మెల్యేకు తెలిపామన్నారు. ఈ సమస్యలను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్ళి పార్కులో మరమ్మతులు చేయించడానికి నిధులు మంజూరు చేయించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ నిధులతో పార్కులో ఉన్న అన్ని సమస్యలు పరిష్కారం కానున్నాయని చెప్పారు. పార్కులో ఆకతాయిలు చేరి గంజాయి సేవిస్తున్నారని, దానిని కూడా తమ ప్రభుత్వం అరికట్టడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ పార్కులో మద్యం, గంజాయి సేవించడం వంటి వాటిని పూర్తిస్థాగా అరికడతామని చెప్పారు.

స్థానిక మహిళ వాణి మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సమస్యలను ఎమ్మెల్యే గద్దె దృష్టికి తీసుకువెళ్ళిన వారం రోజుల వ్యవధిలోనే పరిష్కారం చూపించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పార్కులో వాకింగ్ చేసే సమయంలో యువకులు గంజాయి సేవిస్తూ ఇబ్బందులు సృష్టిస్తున్నారని చెప్పారు. అడిగితే గొడవ పడుతున్నారని అన్నారు. వాకింగ్ ట్రాక్ కూడా సరిగా లేదనే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళామని చెప్పారు. స్థానికంగా ఉంటున్న తామే నిధులు సమకూర్చుకుని వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేయించుకుందామని అనుకున్నామన్నారు. ఈలోగా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళామని, వారం రోజుల వ్యవధిలోనే నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఈ పార్కు గురించి అస్సలు పట్టించుకోలేదని చెప్పారు. స్వల్ప వ్యవధిలోనే సమస్యలు పరిష్కారం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ వసుంధరాదేవి, నందిపాటి దేవానంద్, రామిశెట్టి సతీష్, అరెకపూడి శ్రీనివాసరావు, డాక్టర్ రవికిరణ్, గద్దె రమేష్, చెరుకూరి విజయకుమార్, అడపా నాగేంద్ర, విజయ్, దోమకొండ రవి, దోమకొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.





## అమెరికాలో దర్శి యువకుడు మృతి

◆ప్రమాదవశాత్తు బీచ్‌లో కొట్టుకుపోయిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ బుచ్చిబాబు

◆కుటుంబ సభ్యులను ఓదార్చిన

◆నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ

◆భౌతికకాయాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు

దర్శి (చైతన్యరథం): నియోజకవర్గంలోని గ్రామానికి చెందిన దద్దాల కోటేశ్వరరావు కుమారుడు దద్దాల బుచ్చిబాబు గత ఆదివారంఉదయం అమెరికాలోని బీచ్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అతని మరణం వార్త తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ బాధితులను పరామర్శించి తన సానుభూతి వ్యక్తం చేశారు. తండ్రి కోటేశ్వరరావుతో మాట్లాడిన ఆమె ప్రమాద సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే బుచ్చిబాబు భౌతికకాయాన్ని ముండ్లమూరుకి రప్పించేందుకు ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఆమె దృష్టిసారించారు. తెలుగుదేశం పార్టీ కుటుంబానికి చెందిన కోటేశ్వరావు కుటుంబంలో ఇలాంటి దురదృష్ట సంఘటన చోటుచేసుకో బాధాకరమని లక్ష్మీ ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీశాఖ మంత్రి నారా లోకేష్‌తో, పౌర విమానయాన శాఖ మంత్రి కే.రామ్మోహన్ నాయుడుతో, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో లక్ష్మీ మాట్లాడి యువ ఇంజనీర్ దద్దాల బుచ్చిబాబు భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.

తుంగభద్ర క్రస్ట్‌గేట్ ఏర్పాటులో

## కన్నయ్యనాయుడు చొరవ అభినందనీయం

◆సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు



విజయవాడ (చైతన్యరథం): హెూస్పేట్‌లోని తుగభద్ర జలాశయంలో కొట్టుకుపోయిన 19వ గేట్ స్థానంలో... స్టాప్ లాగ్ ఏర్పాటు ప్రక్రియను విజయవంతంగా పూర్తైన నేపథ్యంలో సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. విజయవాడలోని రాష్ట్ర సాగునీటి సంఘాల సమాఖ్య కార్యాలయం నుండి అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు సాయంత్రం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దశ, దిశ నిర్దేశంతో రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు సూచనలతో హైడ్రో మెకానికల్ ఇంజనీర్, క్రస్ట్ గేట్స్ నిపుణులు ఎస్.కన్నయ్యనాయుడు నేతృత్వంలో ఇంజనీరింగ్ నిపుణుల బృందం - కార్మికులు అంకితభావంతో 24గంటలు అవిశ్రాంతంగా శ్రమించి, యుద్ధప్రాతిపదికన మొత్తం ఐదు 'స్టాప్‌లాగ్'లు ఏర్పాటు చేశారని అన్నారు. వారికి హృదయపూర్వక అభినందనలు అన్నారు. కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ లోని టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సమన్వయంతో సంపూర్ణ సహకారం అందించడంతో ఇది సాకారమయ్యిందన్నారు. తుంగభద్ర బోర్డు నిర్వహణలో ఉన్న డ్యాంలో కొట్టుకుపోయిన 'క్రస్ట్ గేట్' స్థానంలో తాత్కాలికంగా 'స్టాప్‌లాగ్స్' ఏర్పాటు చేసి, డ్యాంలో నిల్వ ఉన్న అమూల్యమైన నీరు వృధాగా సముద్రం పాలుకాకుండా కాపాడారని ప్రస్తుతం 84,000 క్యూసెక్కులకుపైగా డ్యాంలోకి నీటి ప్రవాహం ఉండడం ఊరట కలిగించే అంశం. నష్టపోయిన ముప్పై టీఎంసీల నీరు డ్యాంలోకి వారం రోజుల్లోనే చేరి, మళ్ళీ గరిష్ట స్థాయిలో 105 టీ.యం.సి.ల నీరుతో నిండుగా డ్యాం తొణికిసలాడుతుందన్న విశ్వాసం ప్రజలకు కలిగించారని అన్నారు.

## ఎమ్మెల్యే గళ్లా మాధవి దృష్టికి పాఠశాల సమస్యలు

◆ఎన్జీవో కాలనీ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

గుంటూరు (చైతన్యరథం): నగరంలోని 28వ డివిజన్ ఎన్జీవోఎస్ కాలనీ 7వ లైన్‌లోని ప్రభుత్వ పాఠశాల సందర్శన, మొక్కలు నాటే కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి పాల్గొన్నారు. ఈ సంధర్భంగా విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పలు సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు. ప్రధానంగా ఈ పాఠశాలలో మంచినీటి సమస్య ఉన్నదని, 2 బోర్లు మరమ్మతులకు గురయ్యాయని, వీటిని మరమ్మతులు చేయించి, విద్యార్థులకు సురక్షిత మంచి నీటిని అందించటం కోసం ఆర్.ఓ వాటర్ ప్లాంట్ మంజూరు చేసి నీటి కొరతను తీర్చాలని ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా అధిక విద్యార్థులు చదివే ఈ పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులు లేరని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రాగా, త్వరలోనే ఈ సమస్యల్ని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గళ్లా మాధవి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో తెల్లగోర్ల అప్పారావు, మామిడి రామారావు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీవారి సొమ్ము 'రూ.2 వేల కోట్లు' కాజేసిన వైసీపీ దొంగల ముఠా

- ఆధారాలు మాయం చేసే క్రమంలోనే అగ్ని ప్రమాదం
- ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి
- డిమాండ్ చేసిన బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్



గుంటూరు (చైతన్యరథం): తిరుమల శ్రీవారి సొమ్ము రూ.2 వేల కోట్ల ను వైసీపీ దొంగల ముఠా దోచేసిందని, ఆ విషయం బయటకు రాకుండా ఉండేందుకే పలు కీలక దస్త్రాలు అగ్నికి ఆహుతి చేశారని ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని బ్రాహ్మణ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గత ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో జరగని ప్రభుత్వ ఫైల్స్ దగ్ధం, తరచుగా అగ్ని ప్రమాదాలు చంద్రబాబు ప్రభుత్వంలో ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. తిరుమల వెంకటేశ్వర స్వామి సంబంధించిన కార్యనిర్వాహక కార్యాలయంలో అగ్ని ప్రమాదాన్ని సృష్టించి గతంలో చైర్మన్ గా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి చేసిన 2000 కోట్ల రూపాయల భక్తుల సొమ్ము అవినీతి బాగోతం బయటకు రాకుండా ఉండేందుకోసం అగ్ని ప్రమాదాన్ని సృష్టించారని, ప్రభుత్వ శాఖల్లో ప్రజాధనాన్ని కాజేయటమే కాకుండా చివరాఖరుకు దేవుడు సొమ్మును కూడా కాజేసే దుశ్చర్యకు జగన్ ప్రభుత్వం వైసీపీ నాయకులు దిగజారి అగ్ని ప్రమాదం సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవాణి, ఎల్ వన్, వీఐపీ బ్రేక్ తదితర దర్శనాలు, ఇంజనీరింగ్,ఆహార కాంట్రాక్టులు తదితర అంశాల్లో అనేక అవినీతి జరిగిందని దీనిపైన తక్షణమే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరారు. ఈ ఘటనలో దోషులు ఎంతటి వారైనా, అధికారులు ఉన్నా సరే చట్ట ప్రకారం శిక్షించాలని శ్రీధర్ కోరారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో వివిధ శాఖల అధికారులు జగన్ చేసిన అవినీతిని, రూల్స్‌కు విరుద్ధంగా చేసినా అరాచకాలను కప్పిపుచ్చేందుకు జగన్‌ను కాపాడేందుకు కోసం అధికారులు తీవ్ర తాపత్రయం పడుతున్నారని దాన్లో భాగంగానే ఎన్నికల కౌంటింగ్ జరగక ముందే రాష్ట్ర సిఐడి కార్యాలయంలో ఫైల్స్‌ను, హెరిటేజ్ సంస్థ కాగితాలను తగలబెట్టారని తెలిపారు.

ఇటీవల ఎన్టీఆర్ జిల్లా గుడివాడలో ఫైల్స్ దగ్ధం చేయటం, ఆ తర్వాత పుంగనూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం సృష్టించడం, తాజాగా తిరుమలలో టీటీడీ కార్యాలయంలో ఫైల్స్ తగలబెట్టడం ఇలా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఏర్పడగానే వైయస్ జగన్ ను, అప్పటి మంత్రులు, శాసనసభ్యులను రక్షించడం కోసం ఉన్నత స్థాయి అధికారులే స్వయంగా జగన్ నేతృత్వంలో ఈ అగ్ని ప్రమాదాలకు, దుశ్చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇప్పటివరకు ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్న అధికారులపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోకపోవడంతో, మిగిలిన ప్రాంతాల్లో అధికారులకు కూటమి ప్రభుత్వం అంటే అలుసుగా మారిందని శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి తప్పుడు పనులు చేసే అధికారులను, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఫైల్స్ మాయం చేస్తున్న ఈ అధికారులను తక్షణమే చంద్రబాబు ప్రభుత్వం చట్టరీత్యా కేసులు పెట్టి చర్యలు చేపట్టాలని లేకపోతే గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, ప్రజాధనం దుర్వినియోగం తదితర అంశాలు బయటకు వచ్చే అవకాశం ఉండదని వాపోయారు. అమరావతిలోని రాష్ట్ర ప్రభుత్వ సెక్రటేరియట్ లో కూడా ఇదే పద్ధతిని అధికారులు అవలంబించే ఆస్కారం కూడా ఉన్నదని శ్రీధర్ భయాందోళన వ్యక్తం చేశారు.

# మోసానికి మారుపేరు జగన్మోహన్‌రెడ్డి

- వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేయకుండానే జాతికి అంకితం చేసిన ఘనుడు
- ఏడాదిలో ప్రాజెక్టు పూర్తిచేస్తానని హామీ ఇచ్చి ఐదేళ్లయినా చేయలేకపోయాడు
- నిర్వాసితులకు ఆర్అర్ ప్యాకేజీ విషయంలోనూ మోసం
- ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత జగన్మోహన్‌రెడ్డికి లేదు
- మండిపడ్డ ప్రకాశం జిల్లా టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ



ఒంగోలు (చైతన్యరథం): వెలుగొండ ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత జగన్మోహన్‌రెడ్డికి లేదని జిల్లా టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. వైసీపీ అధికారంలోకి వస్తే ఏడాదిలో ప్రాజెక్టును పూర్తిచేస్తానని 2019 ఎన్నికల్లో జగన్ హామీ ఇచ్చాడని, ఐదేళ్లయినా ప్రాజెక్టును పూర్తిచేయలేకపోయాడని విమర్శించారు. వెలుగొండ మొదటి టన్నెల్‌ను పూర్తిచేసింది తెలుగుదేశం ప్రభుత్వ మేనని, రెండవ టన్నెల్ కూడా సగానికి పైగానే చేశామని తెలిపారు. మిగతా పనులను కూడా వైసీపీ ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు ప్రాజెక్టును పూర్తిచేశామని, జాతికి అంకితం చేస్తున్నామని చెప్పి హడావిడిగా ప్రారంభించి ప్రజలను మోసగించాడని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే మరి నీళ్లు ఎందుకు వదలలేదని ప్రశ్నించారు. నీళ్లు వదిలితే జగన్ బండారం బయట పడేదన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం కూడా చెల్లించలేదని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వంలో వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.12 లక్షలు అర్.అర్. ప్యాకేజీ ఇచ్చామని గుర్తుచేశారు. ప్యాకేజీని రూ.18లక్షలు ఇస్తామని జగన్‌రెడ్డి నిర్వాసితులను దగా చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులకు కనీసం మరమ్మతులు కూడా చేయించకుండా వాటి నిర్వహణను జగన్ గాలివదిలేశాడన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోతే మళ్లీ గేట్లు పెట్టించకుండా నీళ్లు వృథాగా సముద్రంలో కలిసిపోతుంటే చోద్యం చూశారన్నారు. ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ఎవరెన్ని నిధులు కేటాయించారో రికార్డులు చూస్తే అర్థమవుతుందన్నారు. 2014 %-% 19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఐదేళ్లలో మొత్తం రాష్ట్ర బడ్జెట్ 7 లక్షల కోట్లు ఉండగా ప్రాజెక్టులకు రూ.68వేల కోట్లు ఖర్చుచేశామని తెలిపారు. అదే 2019 %-% 24 మధ్య వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఐదేళ్లలో రాష్ట్ర బడ్జెట్ రూ.12 లక్షల కోట్లు ఉంటే ప్రాజెక్టులకు కేవలం రూ.32వేల కోట్లు మాత్రమే ఖర్చుచేశారన్నారు. దీనిని బట్టి ప్రాజెక్టులపై ఎవరికి శ్రద్ధ ఉందో తెలుసుకోవచ్చునన్నారు. కమీషన్ల కోసమే రివర్సింగ్ టెండర్ల పేరుతో పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టర్‌ను మార్చారని, ఐదేళ్లలో 5 శాతం కూడా పనులు చేయలేకపోయారని విమర్శించారు. వెలుగొండ ప్రాజెక్టును టీడీపీ హయాంలోనే ప్రారంభించామని, మళ్లీ ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలోనే పూర్తిచేస్తామని తెలిపారు. మోసానికి మారుపేరు జగన్మోహన్‌రెడ్డి అని, ఆయన ఎన్ని నీతి వాక్యాలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు.

# మంత్రి సవితమ్మ జోక్యంతో తీరిన రహదారి కష్టాలు

- ఆనందంలో మహదేవపల్లి గ్రామస్తులు



పెనుకొండ (చైతన్యరథం): రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత జోక్యంతో మహదేవపల్లి గ్రామస్తుల రహదారి కష్టాలు తీరాయి. స్థానిక రైల్వే బ్రిడ్జి అండర్ పాస్ వద్ద శిథిలమైన రహదారిని మరమ్మతులు చేసి, తాత్కాలిక రహదారిని ఆర్అండ్‌బి అధికారులు నిర్మించారు. దీంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మంత్రి సవిత చొరవ వల్లే రహదారి కష్టాలు తీరాయని గ్రామస్తులు సంతోషం వక్తం చేస్తున్నారు. రొద్దం మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్తను పరామర్శించడానికి మంత్రి సవిత గత ఆదివారం వెళ్లిన విషయం విదితమే. మార్గమధ్యంలో మహదేవపల్లి రైల్వే అండర్ పాస్ రహదారి పూర్తిగా శిథిలమై మోకాలు లోతు వర్షపు నీరు నిల్వ ఉండడం గమనించిన మంత్రి ఆర్ అండ్ బి అధికారులతో తక్షణమే నీటిని తోడి, తాత్కాలిక రహదారి నిర్మించాలని ఆదేశించారు. కేవలం మాటలతోనే సరిపెట్టకుండా దగ్గరుండి రహదారిపై నిలిచిపోయిన వర్షపు నీటిని మంత్రి సవిత తోడించిన సంగతి తెలిసిందే. అనంతరం ఆర్ అండ్ బి అధికారులు శిథిమైన రహదారిపై ఎం శ్యాండ్ మట్టిని కప్పి.. తాత్కాలిక రహదారిని నిర్మించారు.

# టీటీడీలో ఫైల్స్ దగ్ధం వైసీపీ కోవర్టుల కుట్ర

- ఘటనపై సీబీసీఐడి విచారణ జరిపించాలి
- టీడీపీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ డిమాండ్




తిరుపతి (చైతన్యరథం): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందూ ధర్మక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం, టీటీడీలో ఇంజనీరింగ్ విభాగంలో ఫైల్స్ దగ్ధం కావడం వెనుక వైసీపీ కోవర్టుల హస్తం ఉందని ఈ ఘటనపై వెంటనే సీబీసీఐడి దర్యాప్తు చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ డిమాండ్ చేశారు. టీటీడీలో కొంత మంది వైసీపీ కోవర్టులు అంతర్గతంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో తిష్టవేసి గత వైసీపీ పాలనలో అనేక అరాచకాలకు పాల్పడ్డారని, ఇప్పుడు అవిఎక్కడ బయటకు వస్తాయోనన్న భయంతోనే పలు కీలక పత్రాలను దగ్ధం చేశారని సప్తగిరి ప్రసాద్ వ్యాఖ్యానించారు. ఇదే విషయంపై గత ఆదివారం తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో సప్తగిరి ప్రసాద్ మాట్లాడుతూ... టీటీడీ పరిపాలనా భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 13 ఆలయాలకు సంబంధించిన దస్త్రాలు దగ్ధమైనట్లు అధికారులు గుర్తించారని, ముఖ్యంగా శ్రీవారి టిక్కెట్ల అమ్మకాలు, ప్రసాదాల తయారీ, అన్నప్రసాదాలలో నాసిరకం వస్తువుల కొనుగోళ్ళ, రోడ్లకు సంబంధించిన ముఖ్యమైన ఫైల్స్ దగ్ధం కావడం వెనుక వైసీపీ మూకలు ఉన్నాయని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మొన్నటి వరకు జరిగిన అవినీతి అక్రమాలు బయటపడకుండా ఉండేందుకు కొంత మంది అధికారులు వైసీపీ నాయకులకు సాయం చేస్తున్నారని అన్నారు. మదనపల్లి, అమరావతి, పోలవరం, ఏపీ బ్రేవరేజస్ వంటి శాఖల్లో వరస అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోవడం దారుణమన్నారు. దోషులు ఎంతటి వారైనా వారిని శిక్షించాలని సప్తగిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, టీడీపీ నాయకులు విజయ్ కుమార్, గోపాల్, యువరాజు నాయుడు, సురేష్, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్

◆పేదలకు భోజనం వడ్డించిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు (చైతన్యరథం): 'రూ. 20లు పెట్టినా కాఫీ, టీలు దొరకని ఈ రోజుల్లో కేవలం రూ.5లకే అన్నం పెట్టడం అంటే సాధారణ విషయం కాదు. ఇంత మంచి భోజనాన్ని ప్రజలకు అందిస్తున్న సీఎం నారా చంద్రబాబు నాయుడుకి మా ధన్యవాదాలు.' అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని బస్టాండ్ సమీపంలో ఇటీవలే ప్రారంభించిన అన్న క్యాంటీన్ ను పెమ్మసాని స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. అన్నా క్యాంటీన్‌కు వచ్చిన ప్రజలకు దగ్గరుండి పెమ్మసాని వడ్డన చేశారు. అనంతరం అక్కడి ప్రజలతో మాట్లాడుతూ భోజనం ఏర్పాట్లు, రుచి, ఇతర సౌకర్యాలపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజల మధ్యనే పెమ్మసాని అన్నా క్యాంటీన్లో భోజనం చేశారు. అనంతరం పెమ్మసాని చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ... నిత్యం 350 మందికి ఒక్కో అన్న క్యాంటీన్ ద్వారా భోజనం అందిస్తున్న ఘనత టీడీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అన్నా క్యాంటీన్ భోజనం తాను కూడా రుచి చూశానని, చాలా రుచిగా ఉందని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. భోజనంతోపాటు చుట్టూ పరిసరాలు, మెనూ ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయని తెలిపారు. అలాగే గుంటూరు జిల్లాలో పరిశ్రమల లేని రోజున ఒక చిన్నపాటి కాంటినెంటల్ కాఫీ సంస్థను స్థాపించిన రాజేంద్ర ప్రసాద్ వంటి వ్యక్తుల సహకారం నేడు ఎంతో అవసరమని తెలిపారు. అలాంటి పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో మరిన్ని పరిశ్రమలు జిల్లాలో తీసుకురావచ్చని ఆయన ఈ సందర్భంగా వివరించారు. పరిశీలన అనంతరం పలువురు తెలుగు మహిళలు పెమ్మసానికి రాఖీ కట్టి, సోదర భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్, కార్పొరేటర్ పోతురాజు సమత, టీడీపీ నాయకులు సయ్యద్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



# సోదరులకు రాఖీ కట్టిన ఎమ్మెల్యే పరిటాల సునీత

◆తన సోదరులతో పాటు కార్యాలయ సిబ్బందికి రాఖీలు కట్టిన ఎమ్మెల్యే

రాప్తాడు (చైతన్యరథం): రాఖీ పౌర్ణమి సందర్భంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తన సోదరుడు బాలజీతో పాటు పలువురికి రాఖీ కట్టారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో రాఖీ పండుగ ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా సునీత సోదరులు ధర్మవరపు బాలాజీ, కిరణ్ కార్యాలయ సిబ్బంది, గన్ మెన్లకు రాఖీ కట్టారు. వారంతా సునీత ఆశీర్వాదం తీసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నాకు అను నిత్యం రక్షణగా ఉండేది వీరేనన్నారు. ఒక ఎమ్మెల్యేగానే కాకుండా సోదరిగా భావించి ప్రతి క్షణం నా వెంట నడుస్తుంటారన్నారు. రాజకీయాల్లోకి ఇంత ధైర్యంగా నిలబడ్డానంటే ప్రజాభిమానంతో పాటు ఇలాంటి సోదరుల సహకారమేనన్నారు. ప్రతి ఇంట్లో మహిళకు రక్షణగా ఒక సోదరుడు ఉండటం అదృష్టమన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని మహిళలందరికీ రక్షణగా ఉన్నారని సునీత అన్నారు.

# అక్కాచెల్లెమ్మల సంక్షేమంలో చంద్రబాబుకు ఎవరూ సాటిరారు

◆రాఖీపౌర్ణమి సందర్భంగా జీవీకి రాఖీలు కట్టిన సోదరి బ్రహ్మకుమారీలు, తెలుగు మహిళలు



వినుకొండ (చైతన్యరథం : రాష్ట్రంలో అక్కచెల్లెమ్మల సంక్షేమం విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఎవరు సాటిలేరని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు. ఏ ఆడబిడ్డ అయినా జీవితాంతం సోదరులు అండగా ఉండాలని కోరుకుంటారని, ప్రతి అడుగులో ఆ స్ఫూర్తి నిలబెడుతూ అక్కాచెల్లెళ్లందరికీ చంద్రబాబు పెద్దన్నగా ఉంటున్నారన్నారు. రాఖీపౌర్ణమి సందర్భంగా సోమవారం వినుకొండలో బ్రహ్మకుమారీలు, తెలుగు మహిళలు జీవీ ఆంజనేయులుకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడిన ఆయన రాష్ట్రంలోని తెలుగింటి ఆడపడచులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సోదరీసోదరుల మధ్య ఆత్మీయత, అనురాగాలు ఇచ్చిపుచ్చుకునే పండగే రక్షాబంధన్ అని, సమాజంలో స్త్రీకి రక్షణగా నిలిచి, వారిని గౌరవించే తత్వాన్ని ఇంటి నుంచి అలవాటు చేసే గొప్ప సంప్రదాయానికి ప్రతీక రాఖీ పౌర్ణమి అని పేర్కొన్నారు. పేగుబంధం పంచుకుని పుట్టిన అక్కాచెల్లెళ్లకే కాదు.. మన జీవితంలో వివిధ సందర్భాల్లో ఎదురయ్యే ప్రతి సోదరికీ అండగా నిలవడం మన బాధ్యత అని అభిప్రాయపడ్డారు. తెలుగుదేశంపార్టీ, అధికారంలో ఉన్నప్పుడల్లా ప్రభుత్వంలో అక్కాచెల్లెమ్మలకు ఎప్పుడూ అగ్రస్థానమే అందించామన్నారు. ఆడపడుచులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించింది, ఆస్తిలో హక్కు ఇచ్చింది అన్న నందమూరి తారకరామారావు అని గుర్తు చేశారు. నాటి నుంచి నేటికీ పార్టీలో, అధికారంలో ఉన్నప్పుడల్లా ప్రభుత్వంలో సముచిత గౌరవం, ప్రాతినిధ్యం కల్పిస్తూ వస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఏ అక్కాచెల్లెమ్మ పేదరికంతో ఇబ్బంది పడకూడదనే నిరంతరం ఆలోచిస్తుంటారన్నారు. నాడు డ్వాక్రా సంఘాల నుంచి నేటి పీ-4 కాన్సెప్ట్ ద్వారా పేదరికం లేని సమాజం సాధించాలన్న లక్ష్యం వరకు అన్నీ అందుకు నిదర్శమన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

శృంగవరపుకోట చైతన్యరథం: శృంగవరపుకోట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సందర్శించారు. అనంతరం ప్రభుత్వ హాస్పటల్ లో అందించే సేవలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులందరితో జరిగిన సమావేశంలో ఆసుపత్రిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. పేద ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు. గత తెలుగుదేశం పార్టీ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆస్పత్రిని అభివృద్ధి చేశానని, రాబోయే రోజుల్లో కూడా ఆస్పత్రి అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షులు జీ.ఎస్‌నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుంతల రోడ్డుకు మోక్షం..

◆వేగంగా స్పందించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

◆తూముచర్ల-రంగంపేట మార్గంలో మట్టి రోడ్డు నిర్మాణానికి చర్యలు

◆సమస్య తెలిసిన వెంటనే అధికారులతో కలసి రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే

రాప్తాడు (చైతన్యరథం): గుంతలు పడ్డ రోడ్డుతో పాఠశాల విద్యార్థులు, ప్రయాణీకుల ఇబ్బందులపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వేగంగా స్పందించారు. కనగానపల్లి మండలం



తూముచెర్ల నుంచి వయా సి.ఎన్.కోట మీదుగా ఆత్మకూరు మండలం రంగంపేటకు వెళ్లే రోడ్డు గుంతలు పడి.. ఈ మార్గంలో వెళ్లాలంటే నరకప్రాయంగా మారింది. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే బస్సులు బోల్తాపడే పరిస్థితి. చాలా మంది ప్రమాదాలకు కూడా గురయ్యారు. ఇలాంటి రోడ్డు సమస్య.. ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి రాగానే ఆమె వేగంగా స్పందించారు. ఇంజనీర్లను, అధికారులను తీసుకుని రోడ్డు పరిశీలనకు వెళ్లారు. అక్కడున్న పరిస్థితి గురించి స్థానిక నాయకులు, వాహనదారులు వివరించారు. వెంటనే ఆమె సత్యసాయి జిల్లా కలెక్టర్ తో మాట్లాడి పరిస్థితిని వివరించారు. సమస్య విన్న శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ నిధులు ఇచ్చేందుకు హామీ ఇచ్చారు. ముందుగా ఈ మార్గంలో మట్టి రోడ్డు వేసి తాత్కాలిక ఉపశమనం కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే తారు రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఈ రోడ్డు సమస్య చాలా ఏళ్ల నుంచి ఉందని.. అందుకే తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే రోడ్డు నిర్మాణానికి 4.80కోట్ల ఈ.ఏ.పి నిధులు మంజూరు చేయించానన్నారు. పనులు మొదలు పెట్టిన సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి సోదరులు ధన దాహంతో కాంట్రాక్టర్లను కమీషన్ల కోసం బెదిరించారని.. అందుకే ఎవరూ ఈ పనులు చేసేందుకు ముందు రాలేదన్నారు. ఐదేళ్ల నుంచి ఈ రోడ్డు మరింత అధ్వాన్నంగా మారితే కనీసం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రస్తుతం మట్టి రోడ్డు వేసి తాత్కాలికంగా ప్రజలకు ఉపశమనం కల్పిస్తామని.. త్వరలోనే తారురోడ్డు నిర్మాణం చేపడుతామని ఆమె స్పష్టం చేశారు.



# నరసరావుపేట అభివృద్ధికి ప్రత్యేక కృషి

◆ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట చైతన్యరథం: నరసరావుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పట్టణంలో మున్సిపల్ కమిషనర్, శానిటేషన్ సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రధానంగా కాలువలు, చెత్త డంపింగ్ యార్డులు, ఖాళీ స్థలాలపై దృష్టి సారించారు. పట్టణంలోని శ్మశానవాటికల్లో ప్రత్యేక కార్యాచరణతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. శ్మశానవాటికలో చెత్త, మురుగు తొలగింపు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సమాధుల చుట్టూ పేరుకున్న పిచ్చిమొక్కలను తొలగించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను దగ్గరుండి పరిశీలించారు. గత ఐదేళ్లుగా పాలనను గాలికి వదిలేశారని అన్నారు. నాడు-నేడు పేరుతో సొమ్ము దోచుకోవడం తప్ప ప్రజలకు కనీస సదుపాయాలపై దృష్టి పెట్టలేదని అన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఐదేళ్ల తర్వాత ఏం చేసారు అని అడిగితే నీళ్ళు నమిలే పరిస్థితి రాకుండా చూసుకుంటున్నట్లు తెలిపారు. నరసరావుపేట నియోజకవర్గాన్ని సుందర పట్టణాల్లో చేర్చే వరకు విశ్రమించక పని చేస్తానని ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# కోల్‌కతా హత్యాచారంపై సుప్రీంకోర్టు విచారణ

◆సుమోటోగా తీసుకున్న కోర్టు

◆ నేడు సీజేఐ ధర్మాసనం ముందుకు

◆నిందితుడికి సత్య శోధన పరీక్షలు



ఢిల్లీ: కోల్‌కతా హత్యాచారం ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ కేసుపై మంగళవారం విచారణ జరపనుంది. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ఈ మేరకు వివరాలను వెల్లడించారు. 20న విచారించనున్న కేసుల జాబితాలో ఇది కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కేసుపై ఇప్పటికే సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్న విషయం తెలిసిందే. మరోవైపు, జూనియర్ డాక్టర్‌పై దారుణంగా లైంగికదాడికి పాల్పడి, హత్య చేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సంజయ్‌రాయ్‌కి ఆదివారం మానసిక పరీక్షలు జరిపారు. ఢిల్లీ నుంచి కోల్‌కతాకు వచ్చిన సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి చెందిన మానసిక విశ్లేషకులు ఈ పరీక్షలు నిర్వహించారు. కోల్‌కతా పోలీస్ విభాగంలో పౌర వలంటీర్‌గా 2019లో చేరిన సంజయ్‌రాయ్ ఇప్పటికి నాలుగుసార్లు పెళ్లిళ్లు చేసుకున్నాడని, అతడొక తిరుగుబోతు అని, బాక్సింగ్‌లో ప్రవేశం ఉందని వెల్లడైంది. తాజా ఘటన అనంతరం ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పదవి నుంచి వైదొలిగిన సందీప్ ఘోష్‌ను సీబీఐ అధికారులు ఆదివారం కూడా విచారించారు. ఆయన ఫోన్‌కాల్స్ వివరాలను పరిశీలిస్తున్నారు. హత్యాచారం ఘటన జరిగిన ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో సీబీఐ దర్యాప్తు బృందం త్రీడీ లేజర్ మ్యాపింగ్ నిర్వహించింది. ఇదిలా ఉండగా, కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిస్థితులపై ప్రతీ రెండు గంటలకోసారి తమకు నివేదిక పంపించాలని అన్ని రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ ఈనెల 16న ఆదేశాలు జారీ చేసినట్లు తాజాగా వెల్లడైంది. ఈ మేరకు రాష్ట్రాల పోలీసు విభాగాలు కేంద్ర హోంశాఖకు నివేదికలు పంపుతున్నాయి.




# కర్నాటక సీఎం వర్సెస్ గవర్నర్!

బెంగళూరు: కర్నాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇద్దరు సామాజిక కార్యకర్తలు వేసిన పిటిషన్ ఆధారంగా సీఎంపై ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ ఆదేశించారు. మైసూర్ నగర అభివృద్ధి సంస్థ ఉడా స్థలాల పంపిణీలో అక్రమాలపై సీఎం సిద్ధ రామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతించారు.

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇద్దరు సామాజిక కార్యకర్తలు వేసిన పిటిషన్ ఆధారంగా సీఎంపై ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అదేశించారు. మైసూర్ నగర అభివృద్ధి సంస్థ ఉడా స్థలాల పంపిణీలో అక్రమాలపై సీఎం సిద్ధ రామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతించారు. సిద్ధరామయ్య భార్య పార్వతమ్మ పేరిట మైసూరు ప్రాంతంలో ఉన్న భూములను గతంలో అభివృద్ధి పనుల కోసం ఉడా సేకరించింది. పరిహారంగా ఆమెకు మైసూరు-విజయనగరలో స్థలాలు కేటాయించింది. సీఎం మౌఖిక అదేశాలతో ఉడా అధికారులు ఆమెకు ఖరీదైన ప్రాంతంలో విలువైన స్థలాలు కట్టబెట్టారని విపక్ష, బీజేపీ, జేడీఎస్ పార్టీలు ఆరోపిస్తున్నాయి.

# త్రిపుల్ తలాక్ ఆచారం ప్రమాదకరం

◆సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్

ఢిల్లీ: ఇస్లాం మతంలోని త్రిపుల్ తలాక్ ఆచారం ముస్లిం మహిళల పరిస్థితిని దయనీయంగా మార్చిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. త్రిపుల్ తలాక్ ఆచారం వివాహమనే సామాజిక సంప్రదాయానికి ప్రమాదకరంగా మారిందని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో వివరించింది. సుప్రీంకోర్టు 2017లో ఈ అచారాన్ని రాజ్యాంగ విరుద్ధమని పేర్కొందని, అయినా కొంతమంది ముస్లింలలో ఇప్పటికీ ఈ ఆచారం కొనసాగుతోందని అఫిడవిట్ ద్వారా కేంద్రం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. అందువల్ల ముస్లింలలో త్రిపుల్ తలాక్ విడాకుల సంఖ్యను తగ్గించడంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రతిబంధకంగా పనిచేయలేదని తెలిపింది.

త్రిపుల్ తలాక్ బాధితులు పోలీసులను ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేకపోవడం, చట్టంలో శిక్షార్హమైన నిబంధనలు లేకపోవడంతో బాధితుల భర్తలపై ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయిందని, దాంతో పోలీసులు నిస్సహాయంగా మారారని పేర్కొంది. త్రిపుల్ తలాక్ విడాకులను నిరోధించేందుకు కఠినమైన నిబంధనల అవసరం ఉందని వాదించింది.

కాగా త్రిపుల్ తలాక్ విధానం చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయలేదని, అందువల్ల త్రిపుల్ తలాక్ విడాకులను నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని పేర్కొంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దాంతో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది.

# ఆధారాలు దొరకకూడదనే ధ్వంసం చేశారు!

◆ వైద్యురాలి మృతిపై కొనసాగుతున్న నిరసనలు

కోల్‌కతా: కోల్‌కతా వైద్యురాలి మృతిపై నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. బెంగాల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున వైద్య సంఘాలు ఆందోళనకు దిగాయి. వీలైనంత త్వరగా నిందితుడికి ఉరి శిక్ష విధించాలని కోరుతున్నాయి. ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో వైద్యురాలిపై గ్యాంగ్ రేప్ చేసి, దారుణంగా హతమార్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కొందరు మెడికల్ కాలేజీ, ఆస్పత్రిని ధ్వంసం చేశారు. ఆ ఘటనపై మృతురాలి న్యాయవాది బికాష్ రంజన్ భట్టాచార్య స్పందించారు.

### టీఎంసీకి నచ్చడం లేదు

'వైద్యురాలిపై రేప్, హత్య కేసును నిరసిస్తూ జరుగుతోన్న ఆందోళనలు అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఎంతమాత్రం నచ్చడం లేదు. ఆందోళనలు, నిరసనలు జరగకుండా చూడాలని టీఎంసీ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ శ్రేణులకు ఆదేశాలు ఇచ్చారు. ఆ క్రమంలో ఆర్జీ కర్ ఆస్పత్రి మెడికల్ హాల్‌ను టీఎంసీ గుండాలు ధ్వంసం చేశారు. వైద్యురాలిపై లైంగికదాడికి సంబంధించి ఏమైనా ఆధారాలు ఉండొచ్చనే ఉద్దేశంతో దాడి చేశారు. ఆధారాలను ధ్వంసం చేయడమే వారి ప్రధాన ఉద్దేశం అని' లాయర్ బికాస్ రంజన్ స్పష్టం చేశారు.

### 37 మంది అరెస్ట్

ఆర్జీ కర్ ఆస్పత్రిపై దాడి జరిగిన తర్వాత పోలీసులు 37




మందిని అరెస్ట్ చేశారు. అందులో అధికార టీఎంసీతోపాటు విపక్షాలకు చెందిన కార్యకర్తలు ఉన్నారు. దాడి జరిగిన వెంటనే ఇది విపక్షాల పని అని సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. సొంత పార్టీ కార్యకర్తల పాత్ర కూడా ఉందని పోలీసులు వివరించారు. దీంతో టీఎంసీ దాగుడు మూతలు ఆడుతుందని స్పష్టమైంది.

### అనుమానాస్పదం

'వైద్యురాలి మృతిపై తొలి నుంచి సందేహం ఉంది. ట్రైనీ డాక్టర్ అనారోగ్యంతో ఉందని చెప్పారు. అరగంట తర్వాత ఆత్మహత్య చేసుకుందని వివరించారు. ఆ వైద్యురాలిది ఆత్మహత్య లేదా హత్య అనేది అక్కడున్న వైద్యులకు తెలియదు. డాక్టర్ మృతిపై పోలీసులు శాస్త్రీయంగా విచారణ చేపట్టలేదు. మృతదేహానికి ఆగమేఘాల మీద అంత్యక్రియలు నిర్వహించారు. కీలకమైన సాక్ష్యాలను చెరిపివేయాలనే ఉద్దేశంతో నిర్వహించారు. కేసులో తమకు సందేహాలు పెరిగాయి అని' లాయర్ బికాస్ రంజన్ తెలిపారు.

# భారత్‌కు పెను సవాల్‌గా జనాభా పెరుగుదల

◆ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి

ప్రయాగ్‌రాజ్: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ కాలం నుంచి జనాభా నియంత్రణపై భారతీయులు శ్రద్ధ చూపలేదని, పెరుగుతున్న జనాభా దేశానికి పెను సవాలు విసురుతోందని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాగ్‌రాజ్‌లోని



మోతీలాల్ నెహ్రూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, జనాభా పెరుగుదల ప్రభుత్వాలకు సవాలు విసురుతోందని అన్నారు. "ఎమర్జెన్సీ విధించినప్పటి నుంచి భారత దేశ ప్రజలు జనాభా నియంత్రణపై తగినంత శ్రద్ధ చూపలేదు. ఇది మన దేశానికి పెను ప్రమాదంగా మారే అవకాశం ఉంది. జనాభా నియంత్రణలో అమెరికా, బ్రెజిల్, చైనా మనకంటే ముందుస్థానంలో ఉన్నాయి" అని నారాయణ మూర్తి పేర్కొన్నారు.

ఉన్నత ఆకాంక్షలు కలిగి ఉండాలి

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, దేశ పురోగతికి దోహదపడడమే నిజమైన వృత్తి నిపుణుడి బాధ్యత అని మూర్తి అన్నారు. ఉన్నత ఆకాంక్షలను కలిగి ఉండటం, పెద్ద కలలు కనడం, ఆ కలలను నెరవేర్చుకోవడానికి కృషి ముఖ్యమని అన్నారు. ఒక తరం జీవితాలు బాగుపడాలంటే ఎన్నో త్యాగాలు చేయాలి, నా ప్రగతి కోసం తల్లిదండ్రులు, తోబుట్టువులు, ఉపాధ్యాయులు అనేక త్యాగాలు చేశారని.. వారి త్యాగాలు వమ్ముకాలేదని అన్నారు. స్నాతకోత్సవంలో 1,670 డిగ్రీలు ప్రదానం చేశారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు 34 బంగారు పతకాలు పొందగా, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు 13 కాంస్య పతకాలు అందుకున్నారు.

# విద్యార్థులతో మోదీ రాఖీ వేడుకలు

ఢిల్లీ: దేశవ్యాప్తంగా సోమవారం రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. ప్రధాని మోదీ సైతం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఢిల్లీలోని ఓ పాఠశాలకు వెళ్లిన మోదీ విద్యార్థులతో ముచ్చటించారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం చిన్నారులంతా ఒక్కొక్కరుగా వచ్చి మోదీ చేతికి రాఖీలు కట్టారు. సందర్భానుసారం విభిన్న వేషధారణతో ఆకట్టుకునే మోదీ రాకీ పండగకు కూడా తన ప్రత్యేకతను చాటుకున్నారు. మోదీ ధరించిన దుస్తులు నెటిజన్లను అమితంగా ఆకట్టుకున్నాయి. ఆయన ఇవాళ తెల్లటి కుర్తా, లేత ఆకుపచ్చ జాకెట్ ధరించి ఉన్నారు.

